మిసిమి

మాస పత్రిక

జులై - 2001

వెల రూ. 8/-

చిత్రకారుని గురించి

పీటర్ లెలి
1618-1680

పీటర్ లెలి డచ్‌వాడు జర్మనీలో పుట్టాడు, జీవితం అంతా ఇంగ్లాండులో గడిపాడు. వాన్‌డిక్ చచ్చిపోవడం ఒక దుర దృష్టమైతే, ఇది లెలికి అదృష్టమైంది. సరిగా వాన్‌డిక్ చనిపోయిన సమయంలో అతడు ఇంగ్లాండు వచ్చి అతని స్థానాన్ని ఆక్రమించాడు. ఆవిధంగా అతడు లేని లోటును తీర్చి గొప్ప చిత్రకారుడయ్యాడు. అంతర్యుద్ధం జరుగుతున్నంత కాలమంతా అతడెక్కడున్నా చార్లెస్ II ఆస్థానంతో సంబంధాలు పెట్టుకొని ఉన్నాడు.

అతడు కష్టపడి పనిచేసేవాడు. విస్తృతంగా విపులంగా చిత్రాలు గీశాడు. ఆస్థానంలోని అందమైన యువతుల చిత్రాలు ఎక్కువగా చిత్రించాడు. అంతేకాదు, మంచి దేహ పటుత్వం ఉన్న సైనికాధికారులను, ఆలోచనామగ్నులైన మేధావులను గూడ చాల బాగా చిత్రించాడు. సమకాలీన చిత్రకారులలో ప్రధాన చిత్రకారుడే కాదు, లెలి కళాఖండాలను గూడ సేకరించాడు. అతడు మరణించడానికి కొంచెం ముందుగా అతనికి 'నైట్' బిరుదాన్ని ఇచ్చారు.

అతడు ఆడవాళ్ళను, పిల్లలను చిత్రించేటప్పుడు ముఖ్యంగా అతడు "వదులు దుస్తులలో" చిత్రించేవాడు. అలా వదులైన దుస్తులలో చిత్రించడం వలన ఆ చిత్రాలు సంవేదనీయ కాముక, కవితాత్మక ప్రభావాలు వెదజల్లుతాయి.

ముఖ చిత్రం : చెలమ ప్రక్కన నిద్రిస్తున్న దేవకన్నెలు

ఒక అడవిలో చెలమ ప్రక్కన కొంతమంది దేవకన్నెలు విశ్రాంతి తీసుకొంటున్నారు. వారి నిద్రా భంగిమలను అనేక కోణాల నుంచి స్త్రీశరీర నిర్మాణ సొగసును దర్శింప జేయడానికి చిత్రకారుడు అతి జాగ్రత్తగా అమర్చాడు. సందేహం లేదు, ఇంకొంచెంసేపటిలో అతి కామ తప్తులైన అర్ధాజ దేవతలు (సగం మేక-సగం మనిషి) వారి సుఖ నిద్రకు భంగం కలిగించ బోతున్నారు. ఆ ఊటబుగ్గ మీద కొంటె హాస్య-కాముక శిల్పాలున్నాయి. శారీరక వాంఛలను రేపే అవి ఒక డాల్ఫిన్ చేపను లేపుతున్నాయి. వాన్‌డిక్ లాగే, ఇతడూ అప్పుడప్పుడు తనకు భృతిని కలిప్పించే మామూలుగా తాను వేసే చిత్రాలను వదిలి వేసి, ఇటువంటి పురాణ విషయాలను చిత్రించాడు. దీని శైలి లెలి మీద వాన్‌డిక్ ప్రభావాన్ని చూపుతున్నది. బహిరంగ కాముకత, అంతగా గుండెకు పట్టించుకోని తనం - ఈ రెండింటి సంయోగం రాబోయే చిత్రకళా పరిణామంలో ఒక దశను - రొకొను, ఇంకా అప్పటికి పుట్టని ఫ్రాందక్ బేచర్‌ను - గుర్తుకు తెస్తుంది.

మిసిమి

"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.

సంపుటి 13 జులై 2001 సంచిక 7

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

విషయ సూచిక

యక్ష ప్రశ్నలు ముచ్చటగా మూడో పది! -సి. ధర్మారావు

మానవ సంసారానికి నిష్కృతి ప్రేమ - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

బతుకుబడి -డా॥ యు. ఏ. నరసింహమూర్తి

వైవస్వత మనువు రూపుదిద్దిన ఈజిప్టు - సప్తసింధు నాగరికతలు - డా॥ ఎం. వి. ఎన్. కృష్ణారావు

ఇంద్రియాతీత శక్తులు - ఎన్. ఇన్నయ్య

శతాబ్దంతో పాటు తీరు మారిన పరిశోధన - నాగసూరి వేణుగోపాల్

జేమ్స్ జాయిస్ ''డబ్లినర్స్'' - ఒక పరిశీలన - నవీన్

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **చెలమ ప్రక్కన నిద్రిస్తున్న దేవకన్నెలు**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

యక్ష ప్రశ్నలు ముచ్చటగా మూడో పది!

– సి. ధర్మారావు

ప్రపంచాన్ని, ముఖ్యంగా భారత దేశాన్ని బాగా గమనిస్తున్న ఆధునిక యక్షుడికి కుతూహలం పెరుగుతూనే వుండటంతో ఇంకా ప్రశ్నలు సంధిస్తూనే వున్నాడు. మీ జవాబులు ఏమిటో?

1) ధర్మజా, 'రేప్' (మానభంగం) ని హత్యతో సమంచేసి, ఉరిశిక్ష విధించాలనేవారు ఎవరు?
క) స్త్రీ సంఘాలు చ) ఛాందస మతవర్గాలు
ట) స్త్రీలను ఓటర్లుగా మాత్రమే చూస్తూ, వాళ్ల ఓట్లు కాజెయ్యాలనుకునే రాజకీయులు

2) తెలుగు భాషను కాపాడుతున్న దెవరు?
క) రాష్ట్ర అధికార భాషా సంఘం
చ) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ట) చదువులేని తెలుగువారు

3) క్రికెట్ ఆటకు మంచి అనుచరగణం ఎవరు?
క). యువతులు చ) సోమరులు ట) జూదరులు

4) మానవతావాదం (హ్యూమనిజం) అంటే ఏమిటట? ఈ దేశంలో తెగ వాడుతుంటారు?
క) దయాదాన శీలత్వం (హ్యూమానిటేరియనిజం)
చ) మానవుడు జంతువుకంటె కొంచెం భిన్నమైనవాడు అని చెప్పే సిద్ధాంతం
ట) దైవభావం పక్కన పెట్టి, మానవ యత్నానికి, ప్రజ్ఞకి పెద్ద పీటవేసేవాదం.

5) సినిమాల్లో 'బట్టబయలు' శృంగారానికి ఎవరు ఎక్కువ బాధ్యులంటారు?
క) సెన్సారువారు చ) సినిమా నిర్మాతలు ట) సదరు లలనామణులు

6) అన్నింట్లోనూ బహుతేలికైన విషయం ఏది?
క) వరల్డు బ్యాంకు రుణాలు చ) ఎన్నికల ముందు వాగ్దానాలు ట) ఒరులకి సలహా ఇవ్వటం

7) అన్నింట్లోనూ బహు గహనమైన విషయం ఏది?
క) కులాల మూలాలు తెలుసుకోవటం
చ) పోనీ, నదుల మూలాలు తెలుసుకోవటం ట) తన్ను తాను తెలుసుకోవటం

8) ఏకపక్షమే అయినా, ఏ జంటలో మోజు ఎక్కువుంది?
క) రావణుడు - సీత చ) తెలుగు కవి - నోబెల్ ప్రైజు
ట) ఎం. ఎఫ్. హుస్సేన్ - మాధురీ దీక్షిత్

9) మనిషి శరీర భాగాల్లో అతి తక్కువ వ్యాయామం పొందేది ఏది?
క) ముఖ కండరాలు చ) సెక్సు భాగాలు ట) మెదడు

10) దక్షిణాదిన ఇటీవల ఒక అపూర్వ క్రీడా విన్యాసం చేసిన విదుషీమణి ఎవరు?
క) పి.టి. ఉష చ) కరణం మల్లీశ్వరి ట) జయలలిత

సమాధానాలు మీకు గిలిగింతలు పెడతాయ(ట)

సి. ధర్మారావు, హైదరాబాదు, సెక్రెటేరియేట్‌లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు.
ప్రస్తుతం Freelance writer గా ఉంటూ, 'మరో ప్రపంచం' పత్రిక సంపాదక వర్గంలో ఉన్నారు.

మానవ సంసారానికి నిష్కృతి ప్రేమ

-అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

''నేను ఏకాకిని, నాకు ఎవరూ లేరు. నేను గుంపులో ఉన్న వెలుపలి వాణ్ణి. నాకు ఆధార పడడానికి ఏ ఒక్కరూ లేరు. నేను దేవునికీ, ప్రపంచానికి ప్రకృతికి, మానవాళికి వెలుపలివాడిని. అసలు నాకు నేనే దూరుణ్ణి, వెలుపలివాడిని, పరాయి వాణ్ణి. నాకు నేను కొత్త వాణ్ణి. నేనెవరినో నాకు తెలియదు.'' ఈ అనుభవం ఇవ్వాళ ఆలోచనా పరుడైన ప్రతివానిని వేధిస్తున్నది. మరి ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? ఆధునిక జీవితంలో కొనుగోలు సంస్కృతి పెరగడంతో, యాంత్రిక సంస్కృతిలో మనిషి ఒక యంత్రమై పోవడంతో, కంప్యూటర్ సంస్కృతితో ఈమెయిల్, ఈ షాపింగ్, ఈ అడ్మినిస్ట్రేషన్, ఈ - సెక్స్, ఈ - ప్రేమ, ఈ - వివాహంలలో మునిగి పోవడంతో, అవసరం లేకపోయినా, మనచేత వస్తువులను కొనిపించే ప్రకటన ప్రచార సాధనాల మత్తులో, వస్తువులను కొనే వినిమయ సంస్కృతికి బానిసై పోవడంతో మనిషి తనను తాను పోగొట్టుకున్నాడు. అంతేకాదు, ఎదుటి వారికి అందంగా ఆకర్షణీయంగా కనిపించడమెలా? మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముడుపోయే గుణాలను, నిపుణతలను పెంచుకోవడం ఎలా? అనే ఆరాటంలో అసలు మనిషే ఒక వ్యాపార వస్తువై పోయాడు, వినిమయ వస్తువై పోయాడు. ఇలా మానుషతను, మానవత్వాన్ని, మానవీయతను పోగొట్టుకొన్న మానవునికి నిష్కృతి లేదా?

జీవరాశులన్నింటిలోకి తన అస్తిత్వాన్నే తానొక సమస్యగా ఎంచినవాడు మానవుడొక్కడే. అతనికి ఆత్మ చైతన్యం (Self consciousness) ఉంది. ఇది ఏ ఇతర జీవికి లేదు. ఈ కారణంగానే అతనికి ''తాను ఇతరుల కంటె వేరు'' అనే 'ఎరుక' కలిగింది. ఈ ఎరుకతోనే 'నీవు' 'నేను' అనే ద్వైధీ భావం, వేరుతనం (Separateness) వచ్చింది. అప్పటి నుంచే మనిషి మనిషికి ఎడమై పోయాడు. మరి ఈ దూరాన్ని దాటడం ఎలా?

మనిషి పుట్టినప్పుడు జంతువు సహజాతాలతోనే పుట్టాడు! తరవాత ఆలోచన పెరిగింది. నాగరికత వికసించింది. ప్రకృతి ఒడిలో అనుభవించిన స్వర్గానికి అతనికి మధ్య నాగరికత అడ్డుగోడై నిలిచింది. ప్రకృతికి దూరమయ్యాడు. ఇనుము, సిమెంటు ప్రకృతి ఇచ్చే వస్తువులు కావు. ఇవి అతనికీ ప్రకృతికి మధ్య అడ్డు గోడగా నిలిచాయి. మరి ఇక ఆ స్వర్గాన్ని చేరలేడు. అతడు ప్రకృతిలో భాగమై ఉండి కూడా దానికి దూరమయ్యాడు. దాని నుంచి వేరుతనాన్ని అనుభవిస్తున్నాడు. 'లయ'ను పోగొట్టుకొన్నాడు. ఈ పూర్వ లయకు మారుగా మానుషమైన కొత్త లయను మాత్రమే వెదుక్కోగలడు. ఈ కొత్త లయ ఎక్కడ దొరుకుతుంది?

మరణాన్ని తాను జయించలేడు. ప్రాకృతిక శక్తుల ముందు తాను అల్పుడు. తనకు ఇష్టం లేకనే తాను ఈ భూమి మీద ప్రభవించాడు. తన జీవితం క్షణభంగురం. తన ఇచ్ఛకు విరుద్ధంగా మరణిస్తున్నాడు. తాను ప్రేమించిన వ్యక్తులు తనకంటె ముందుగా మరణిస్తున్నారు. అతనికి ఈ అనైక్య విఘటిత స్థితి భరించరాని కారాగారమైంది. ఈ కారాగారం నుంచి బయటపడి ఏదో విధంగా ఇతర మానవులతో,

బాహ్య ప్రపంచంతో ఐక్యం కానట్లైతే, సంలీనం కానట్లైతే అతడు పిచ్చి వాడైపోతాడు. మరి ఆ ఐక్యం, ఆ సంలీనమయ్యే మార్గం ఏది? పృథక్త్వాన్ని అధిగమించడం ఎలా? సమాగమాన్ని సాధించడం ఎలా? వైయక్తిక జీవితాన్ని దాటి నిష్కృతిని పొందడం ఎలా?

ఈ ప్రశ్న లన్నింటికి సమాధానం ప్రేమ. ప్రేమ అంటే ఏమిటో, ప్రేమలో ఏం జరుగుతుందో చర్చించబోయే ముందు మానవుడు ఏకాకితనాన్ని, వేరుతనాన్ని జయించడానికి అనుసరించే కొన్ని మార్గాలను చూద్దాం.

ఒంటరి తనాన్నుంచి బయట పడే ఒక మార్గం రకరకాల పారవశ్యం: అవి తాగి తందనాలాడడం, రాత్రి వేడుకలు, జాతర్లు పూనకాలు, మాదక ద్రవ్యాల సేవనం, కర్మకాండలలో లీనం కావడం. వీటిల్లో మునిగి పోయినప్పుడు, బాహ్య ప్రపంచం అంతరిస్తుంది. ఒంటరితనం అదృశ్యం అవుతుంది. ఈ ఉన్మత్త తాండవంలో అందరూ భాగస్వాములే కనుక సమాజమూ తనూ ఒకటే అనుకొంటాడు. పారవశ్యం నుంచి బయట పడగానే అతనిని మళ్ళీ ఒంటరి తనం ఆవహిస్తుంది.

ఇలాంటి పారవశ్యాన్నే కొందరు లైంగిక కార్యంలో పొందుతారు. ఇది ప్రేమ లేని కామ క్రీడ అయినప్పుడు ఆ ఇద్దరి మధ్య అంతరాన్ని పూడ్చలేదు.

మరో మార్గం సమాజంతో సంలీనం కావడం: అంటే ''సమాజానికి చెందుట'', అనేది ఇందులో ముఖ్యాంశం. ఆవిధంగా అతడు జాతి, దేశం, గ్రామం, వేష భాషలు, ఆచార వ్యవహారాలకు అనుగుణవర్తనుడై ఒంటరి తనాన్ని అధిగమిస్తాడు. ''నేను భారతదేశానికి, జాతికి చెందినవాణ్ణి'', అని అనుకోవడంలో ''చెంది ఉండుట'' అనేది ఉంది. అలా చెంది ఉన్నప్పుడు అతను ఒంటరి తనాన్ని, వేరు తనాన్ని అధిగమిస్తాడు.

సంలీనాన్ని సాధించే మరో విధం సృజనాత్మక క్రియ: సృజనాత్మక క్రియలో, అతడు వడ్రంగి కాని, రైతుకాని, చిత్రకారుడు కాని, తను సృజించే వస్తువులో ఐక్యమవుతాడు ''ప్రణాళిక వేసుకొంది నేను, ఉత్పత్తి చేసింది నేను, నా కృషి ఫలితాన్ని అనుభవించగలిగింది నేనే'', అని అనుకోగలిగింది ఒక్క ఉత్పాదక క్రియలోనే.

ఉత్పాదక క్రియలో సాధించిన సంలీనత వ్యక్తుల మధ్య సంలీనత కాదు. జాతర్ల తన్మయత్వం క్షణ భంగురం. అనువృత్తి అంటే Conformity వల్ల సాధించిన సంలీనం మిధ్యా సాయుజ్యం మాత్రమే. మానవ సంసారానికి పూర్తి పరిష్కారం వ్యక్తికీ వ్యక్తికీ మధ్య సాధించే సాయుజ్యంలో, మరొక వ్యక్తిలో సంలీనం చెందడంలో.. అంటే 'ప్రేమ'లో వుంది.

''ఇతరులతో ఐక్యం కావాలి, కలవాలి'' అనే వాంఛ మనిషికున్న వాంఛలలోకెల్ల అత్యంత ప్రాథమికమైన మానసిక ఉత్కంఠ. మానవ జాతిని, తండాను, కుటుంబాన్ని, సమాజాన్ని కలిపి ఉంచే శక్తి అది. 'ప్రేమ' లేనిదే మానవాళి ఒక్కనాటికి మనలేదు. అయితే ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే, అన్నిరకాల సాయుజ్యం, సంలీనం ప్రేమ కాదు. దైవసాయుజ్యం ప్రేమకాదు. మానవ

సంసారానికి పరిష్కారమైన సాయుజ్యం మాత్రమే ''పరిణత ప్రేమ''. మరి ఈ పరిణత ప్రేమ అంటే ఏమిటి?

ప్రేమ అంటే జనం ఆవురావురు మంటూ ఉంటారు. ప్రేమలో పడతారు (They fall in love). వారు ప్రేమలో పడతారే కాని ప్రేమలో నిలబడలేరు (They don't stand in love). వారంతా ''ప్రేమించబడాలని'' కోరుకొంటారే, కాని ప్రేమించాలనుకోరు. వారు ఎదుర్కొనే సమస్య ప్రేమించబడుట ఎలా? ప్రేమించబడాలంటే ఎలా ఉండాలి? అనేదే. వారు ప్రేమించబడడానికి కావలసిన వేష, భాషలు, Sex appeal తో కనిపించడంలాంటివన్నీ అలవరుచుకొంటారు. ''ప్రేమార్హమైన వస్తువు కనిపిస్తే చాలు, ప్రేమించడం నాకు చేతనవును'' అనుకొంటారు. ఈ రకం అబ్బాయి - అమ్మాయి ప్రేమలో తొలి మత్తు వదిలిపోగానే, అసలు వాస్తవం బయటపడి, వెగటు చెందే అవకాశాలున్నాయి. మనం మాట్లాడే ప్రేమ ఇలాంటిదికాదు.

మనం మాట్లాడేది పరిణత ప్రేమ. అంటే వ్యక్తి సమగ్ర వ్యక్తిత్వాలు దెబ్బతినకుండా జరిగే సంలీనం. ప్రేమ అంటే మనిషిలోని క్రియాశీలక శక్తి. మనిషి నుంచి మనిషిని వేరుచేసే అడ్డుగోడలను ఛేదించే శక్తి. అతనిని ఇతరులతో కలిపే శక్తి. గమ్మత్తు ఏమిటంటే ఈ ప్రేమలో ఇద్దరూ ఒకటై గూడ రెండుగ ఉంటారు.

ప్రేమ క్రియాశీలం అంటే అందులో గొప్ప అర్థం ఉంది. ఏదో ఒక ప్రేరణతో - అంటే ధనాశతోనో, కాంక్షతోనో - పనిచేసేవాడు, తెంపులేని పనిలో మునిగిపోయేవాడు - కోర్కెకు బానిస. కోర్కె అంటే లక్ష్యం అతనిని పనిలోకి ఈడుస్తుంది. అందుకని వాస్తవానికి ఈడ్వబడిన వీరి క్రియాశీలత నిష్క్రియాత్మకత. అతడు 'కర్మ' యే గాని 'కర్త' కాదు. విశ్వంతో సంలీనం చెందాలని ఎవడైన ధ్యానం చేస్తుంటే, వాణ్ణి నిష్క్రియుడంటుంది. నిజానికి కేంద్రీకృత ధ్యానం అన్నింటిలోకి క్రియాత్మకమైంది. అందులో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్నాయి. అందుకని ప్రేమ క్రియాశీలం, నిష్క్రియాత్మక ప్రభావం కాదు. ప్రేమ అంటే అందులో నిలబడడం, పడిపోవడం కాదు.

ప్రేమ లక్షణం ఇవ్వడమే కాని పుచ్చుకోవడం కాదు. సృజనాత్మకశీలికి దానం అంటే అర్థం వేరు. ఇవ్వడంలో నేను ఏమిటో, నా బలం సంపత్తి సత్తాలు తెలుస్తాయి. ఏదో సచేతనానుభవం పొంగి పొరలి, నేనేమిటో నాకు తెలిసినట్లనిపిస్తుంది. ఇదే విషయాన్ని లైంగిక రంగానికి అన్వయించినా తెలుస్తుంది. మగవానికి 'లైంగిక పరాకాష్ఠ' దానంలో, తన వీర్యాన్ని స్త్రీకి ఇవ్వడంలో, విస్పష్టిలో అంటే భావప్రాప్తిలో ఉంది. ఇదే స్త్రీకి వర్తిస్తుంది. తన స్త్రైణ కేంద్ర ద్వారాలు తెరిచి పుచ్చుకొంటూనే ఇస్తుంది. అంతేగాదు, ప్రేయసిగా కాక తల్లిగా, తనలో పెరుగుతున్న బిడ్డకు తనను తాను అర్పించుకొంటుంది. శిశువుకు పాలను తన ఒంటి వేడిని దానం చేస్తుంది. వీటిని ఇవ్వకపోతే ఆమెకు బాధ. ఈ విధంగా ఇవ్వడంలో తనను తాను అర్పించుకోవడంలో ప్రేమ ఉంది. తనలో ఉన్న సృజనాత్మకతను, ఉత్పాదకతను, తన సంతోషాన్ని, అర్థాన్ని, అవగాహనను, విజ్ఞానాన్ని, హాస్యాన్ని, దుఃఖాన్ని - తనలో సజీవమైన ప్రతిదాన్ని అభివ్యక్తీకరణాన్ని, ఆవిష్కారాన్ని రెండోవానికి ఇస్తాడు. రెండోవాడు ఆవిధంగా సుసంపన్నమవుతున్నాడు. ఇందులో తిరిగి పుచ్చుకోవాలనే కోర్కె లేదు. అసలు

ఇవ్వడమే పరమానందం. ఇలా ఇవ్వడంలో రెండో వానిలో ఏదో ఒక అంశం జాగృతం కాక మానదు. అలా జాగృతమైన అంశం తిరిగి మొదటి వాని మీదికి ప్రసరించక మానదు. ఈ విధంగా,ఇవ్వడమంటే రెండోవానిని గూడ దాతను చేయడమే. అప్పుడు వారిద్దరు కొత్తగా జీవం పోసుకొన్న అంశం నుండి సంతోషాన్ని పొందుతారు. దాన క్రియలో ఏదో కొత్తది పుడుతుంది. ఇలా ఆవిర్భవించిన నూతన చైతన్యానికి ఇద్దరూ కృతజ్ఞులై ఉంటారు. దీనినే ప్రేమ పరంగా చెప్పాలంటే; ప్రేమ అనేది ప్రేమను పుట్టించే శక్తి. మార్క్స్ దీనిని చాల అందంగా చెప్పాడు. ''మనిషిని మనిషిగా చూడు ప్రపంచంతోడి అతని సంబంధాన్ని మానవీయంగా చూడు. అప్పుడు మాత్రమే ప్రేమకు ప్రేమను, విశ్వాసానికి విశ్వాసాన్ని మారకం వేయగలవు''. మనిషితో, ప్రకృతితో నీకున్న సంబంధాలన్నీ నీ సంకల్పానుగుణమైన అసలు వ్యక్తిగత జీవితాన్ని ప్రతిబింబించాలి. నీ ప్రేమ ఇతరులలో ప్రేమను పుట్టించ జాలనట్లయితే, నీ ప్రేమ ప్రేమను జనింపజేయ జాలనట్లయితే, ప్రేమైక జీవిగా నీవు గావించిన జీవితాభివ్యక్తీకరణం నిన్ను ప్రియునిగా, ప్రేయసిగా, చేయలేకపోయినట్లైతే అటువంటి నీ ప్రేమ నిర్వీర్యం, దురదృష్టకరం.

ప్రేమకు ముఖ్య లక్షణం దానం ఒక్కటే కాదు. ఆ ప్రేమ సాదరత (Care), బాధ్యత (Responsibility), గౌరవం (Respect), అవగాహన (Understanding) లతో కూడినదై ఉండాలి.

మాతృప్రేమలో సాదరత ఉంది. జీవితం మీద మనం చూపించే అపేక్షే ప్రేమ. మనం ప్రేమించే వస్తువు అభివృద్ధిని కోరేది క్రియాత్మక ప్రేమ.

బాధ్యత అంటే 'విధి' కాదు సంపూర్ణ ఐచ్ఛిక కర్మ. తల్లి బిడ్డ సంబంధంలో తల్లి బాధ్యత వహిస్తుంది. వయోజన ప్రేమలో అయితే రెండోవారి మానసికావసరానికి ప్రతిస్పందించడమే బాధ్యత. ప్రేమలో మూడో కారకం గౌరవం. గౌరవం అంటే ఎదుటివాడు యధాతథంగా ఎదగాలనే ఆకాంక్ష. దోపిడి ఉండదు. నేను ప్రేమించే వ్యక్తి నాకు బానిసగా ఉండాలని కోరను. అతడు నా చేతిలో ఉపకరణం కావాలని కోరక, అతడెలా ఉంటే అలాగే అతనితో ఐక్యమవుతాను.

ప్రేమలో నాలుగో కారకం అవగాహన: అవతలి వానిని తెలుసుకోకుండా గౌరవించలేం. అవగాహన మార్గదర్శకం కాకపోతే ఆదర్శం బాధ్యతలు గుడ్డివైపోతాయి. ప్రేమలోని భాగం అవగాహన; నామీద నాకున్న అపేక్షను చీల్చుకొని, అవతలి వ్యక్తిని నాలాగే చూడగలిగినప్పుడు, అవగాహన అంతర కుహరంలోకి చొచ్చుకుపోతుంది.

జీవశాస్త్రంలో మానవుడు పరమాద్భుతం. మనిషి తనకు తాను అంతులేని రహస్యం. తోటి వానికి అతడు అంతు బట్టని మర్మం. తోటివాడూ అంతే. ఎరుగుండడం. ఎరగం. ఆత్మానం విద్ధి (know thyself). ఉపనిషత్తులు, డెల్ఫి అన్నాయి. మానవుని అంతరాళంలోకి తొంగి చూడాలంటే, జ్ఞానం ద్వారా సాధ్యం కాదు. ఇంకా మనిషిని గురించి వెయ్యి రెట్లు తెలిసినా మనిషి ప్రశ్నగా మిగిలిపోతాడు. అతని గురించిన సంపూర్ణ జ్ఞానం కావాలంటే ''ప్రేమ'' ఒక్కటే మార్గం. ఇది ఆలోచనకతీతం. సంలీనానుభవంలోకి సాహసోపేతంగా మునకలు వేయటం ఆ ప్రేమ. ఈ ప్రేమకు హింస అంటదు. ద్వేషం సోకదు.

(ఆలిండియా రేడియో, విజయవాడవారి సౌజన్యంతో)

బతుకుబడి

(1934వ సం॥ నోబెల్ సాహిత్య పురస్కార స్వీకారోపన్యాసము)

మూలం : లూయిజి పిరండెల్లో అనుదము : డా॥ యు. ఏ. నరసింహమూర్తి

ఆభిజాత్య సంపన్నులయిన మీవంటి వారి పంక్తిలో పరిమళ ప్రౌఢిమను సంతరించుకున్న ఈ భరద్వాజ విందు, ఈ సాయం సమయపు స్వాగత సంరంభం, ప్రతిష్ఠామహితమైన భరతవాక్య సదృశమైన, ఘనత మహించిన మీ ప్రభువుల అమృత హస్తాల మీదుగా అందుకొన్న 1934వ సంవత్సరపు సాటిలేని నోబెల్ సాహిత్య పురస్కారం నాలో ప్రగాఢ కృతజ్ఞతాభారాన్ని, పరిపూర్ణ తృప్తిని నింపుతున్నాయి. ఈ విశిష్ట పురస్కారానికి తగినంత గాఢంగా కృతజ్ఞతలను తెలుపుకునే అవకాశాన్ని నాకివ్వండి.

నా సుదీర్ఘ సారస్వత వ్యాసంగానికి మకుటాభిషేకం చేసిన స్వీడిష్ అకాడమీకి కూడా అత్యధిక గౌరవంతో త్రికరణ శుద్ధితో కూడిన కృతజ్ఞతను తెలుపుకుంటున్నాను.

సాహిత్యంలో నా సాముగరిడీల నన్నింటినీ బతుకు బడిలోనే నేర్చుకున్నాను. చాలామంది మేధావుల కది పనికిమాలిన బడి. కాని నాలాంటి తలకాయలకు సాయం చేసేది ఆ బడి ఒక్కటే. చురుకుతనం, శ్రద్ధ, ఓర్పు, అచ్చమైన పసితనం నిండిన అమాయిక విద్యార్థిని నేనక్కడ. అయ్యవార్లు నేర్పిన దాని మీద నమ్మకం, విశ్వాసం కుదరకపోయినా జీవితం పట్ల మాత్రం ఎప్పుడూ నమ్మకాన్ని, విశ్వాసాన్ని కోల్పోని విద్యార్థిని. ఈ నమ్మకం నా మౌలిక ప్రకృతిలోని నిరాడంబరత్వంలో గూడు కట్టుకుని ఉంది. ఏశంక మినహాయింపు లేకుండా జీవన సాక్షాత్కారాన్ని నమ్మవలసిన అవసరాన్ని నేను గుర్తించేను.

నిరంతర శ్రద్ధతో, మర్మంలేని నిజాయితీతో నేనీ పాఠాన్ని నేర్చుకున్నాను. అందుకే జీవితం పట్ల నాకెంతో విధేయత, ప్రేమ, గౌరవం. విషమమైన అపోహలను, బాధలు నిండిన అనుభవాలను, భయంకర గాయాలను, మనకు లోతైన విలువైన అనుభూల నిచ్చే అమాయిక దోషాలను జీర్ణం చేసుకునే శక్తి నిస్తుంది జీవితం. ఎంతో మూల్యాన్ని చెల్లించి సాధించిన ఈ జీవన విద్య నన్ను నన్నుగా ఉంచుతూ ఎంతో ఎదిగేలా చేసింది.

జీవితాన్ని భరించే సామర్థ్యంలేని నాలోని సహజ కళా కుశలతలన్నీ నన్ను విడిచిపోయాయి. ఊహల్ని, అనుభూల్ని నింపుకోగల వాస్తవ శిల్పినయ్యాను. నా ఊహలన్నీ నా అనుభూలే, నా అనుభూలన్నీ నా ఊహలే. నేను నమ్మగల దానిని, అనుభవించిన దానిని మాత్రమే నేను సృష్టించేను.

మీరు నా కందించిన అపురూపమైన ఈ పురస్కారాన్ని నా సాహిత్యం అందుకోవడాన్ని చూసి ప్రగాఢమైన కృతజ్ఞతను, ఆనందాన్ని, గర్వాన్ని పొందుతున్నాను.

ఈ పురస్కారం నావ్యక్తిగత ప్రజ్ఞకు లభించినదని నేను భావించడం లేదు. నా సృజనలోని మానవీయ నిబద్ధతకు ఈ పురస్కారం లభించిందని నేను సంతోష పూర్వకంగా విశ్వసిస్తున్నాను.

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం,
మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షులుగా పనిచేస్తున్నారు.

నోబెల్‌సాహిత్య పురస్కారస్వీకారానికి ముందుగా కరోలిన్ ఇన్‌స్టిట్యూటుకు చెందిన ప్రొ. గొరాన్ విజ్లెస్ట్రాండ్ ఈ విధంగా అభినందించేరు. ''జీవన వ్యవస్థలో వ్యక్తి కంటె సమాజం పెద్దది. అది బహుధా సంకీర్ణమైనది. జీవితంలో వివిధ రీతుల సమన్వయం ఉంటుంది. అవసరమైన ఆ సమన్వయాల మధ్య చెలరేగే సంఘర్షణలే శ్రీపిరండెల్లో సాహిత్యానికి వస్తువులు. ప్రస్తుతం వైద్య విజ్ఞానం వంటి ఇతర శాస్త్రీయ రంగాలలో కాక జీవన సమస్యలు ముందుగా పరిశోధించదగినవిగా కనిపిస్తున్నాయి. తత్త్వవేత్త - కవి - నాటక కారుడు అయిన శ్రీ పిరండెల్లో మానవ నైజంలో విభిన్నదశలను అవగాహన చేసుకోవడంలోను వర్ణించడంలోను కడు సమర్థుడు. జీవన రుగ్మతలోని పరిణామాలనాయన అధ్యయనం చేసేడు. సగటు మనసుతో దానికుండే సూక్ష్మ సంబంధాలను తెలుసుకున్నాడు. వాస్తవానికి కలకి మధ్య నుండే అదృశ్య మర్యాదాగర్భంలోకి ఆయన తలమునకలుగా చొచ్చుకుని పోయేడు. అద్భుత నాటక కళాకుశలులలో ఒకనిగా ఆయనను మేము గౌరవిస్తున్నాము.

సమర్పణ

(పెర్ హాల్‌స్ట్రోమ్ - స్వీడిష్ అకాడమీ శాశ్వత కార్యదర్శి)

లూయిజి పిరండెల్లో రచనావ్యాసంగం విస్తృతమైనది. అతడు రాసినన్ని నవలిక లెవరూ రాయలేదు. ఈ ప్రక్రియకు మూలమైన దేశంలో బొకాకియో 'డెకమెరాన్' లో వంద నవలికలున్నాయి. పిరండెల్లో నవలికలను రోజుకొకటిగా లెక్కపెట్టినా సంవత్సరం పాటు లెక్కపెట్టవచ్చు. ఆ నవలికల్లో వస్తువైవిధ్యమే కాదు. పాత్ర చిత్రణకూడా వైవిధ్య భరితంగా ఉంటుంది. జీవితానికి సంబంధించిన వర్ణనలన్నీ వాస్తవికంగా ఉంటాయి. తాత్త్వికంగా ఉంటాయి. విరోధాభాసాలుగా ఉంటాయి. వాటినిండా హాస్యం, అధిక్షేపం ఉంటాయి. వాస్తవికతా నియమాలు ఆదర్శపూరిత సృజనాత్మక సత్యానికి దారివిడచే, ఆత్మ విశ్వాసం తొణికిసలాడే కవితాభావుకత ఆ రచనల్లో కనిపిస్తుంది.

అప్రయత్నంగా అందిన దానినల్లా అనుకూలంగా మలుచుకునే పద్యస్ఫూర్తి, జీవితం ఈ నవలికల్లో సర్వసాధారణ లక్షణంగా కనిపిస్తుంది. కాని నవలిక కొక నిర్దిష్ట నిర్మాణ రీతి ఉన్న కారణంగా మలుచుకోవడం వలన కలిగే ఫలితాలను కూడా మనమీ రచనల్లో చూస్తాము. పిరండెల్లో వస్తు నిర్వహణలో తొందరపాటు ప్రదర్శించడంలో వేగంగా అదుపుతప్పిన సమగ్ర నిర్వహణను పట్టించుకునేవాడు కాదు. అతని నవలికలు మౌలికమైనవే, కాని సమగ్ర సౌష్ఠవంకల హస్తవాసి వాటిలో కనబడదు. తరువాత తరువాత ఆయన నాటక కళలోని అనేక కీలక దశలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం కాగలదు.

పిరండెల్లో ఆధునిక నాటక రంగానికి సమర్పించిన అత్యంత మౌలిక ఉపాదానాలే ఆయన ప్రాథమిక నవలా వ్యాసంగానికి ప్రేరణలు. అయినా ఆయన నవలలు సాహిత్య శిఖరాలను అందుకోలేక పోయేయి. తన ఊహల నిశ్చితరూపాల నన్నింటినీ ఆయన నాటకరంగం కోసం కట్టి ఉంచాడు.

ఈ విహంగ వీక్షణంలో సమకాలీన భౌతిక వాద ప్రపంచపు యాంత్రిక జీవనాన్ని చూసి భయవిహ్వలుడై, పరాఙ్ముఖుడైన పిరండెల్లో మనోగతమైన ముఖ్యాంశం **Shoot 1 (1916)** అన్న నవలలో ప్రగాఢంగా కనిపిస్తుంది. ''షూట్'' అన్నది సినీమాకు సంబంధించిన సాంకేతిక పదం. దృశ్య చిత్రీకరణ సమయంలో ఈ అభివ్యక్తి నటుల్ని బెదిరిస్తుంది. కథకుడు పెద్ద చిత్ర పరిశ్రమలో ఛాయాగ్రాహకుడు తన పనిలో ఒక విశిష్టమైన అర్థాన్ని చూస్తాడతను. అతనికి ఔగాములతో నిండిన జీవితమంతా అర్థం పర్థం లేని ఊసుపోక కోసం పుట్టుకొచ్చిన గతానుగతిక ప్రతిమా సమాహారంగా కనిపిస్తుంది. దాని కింకొక ప్రయోజన మంటూ ఏదీ లేదు. కెమెరా దొర్లుకు పోయే ఫిల్ము అనే నాలికతో మరణం, శూన్యం అనే పిండీకృత తాత్త్విక సత్యంతో నిండిన దృశ్య జగత్తులోని బాహిర వాస్తవాన్ని దిగమింగే రాక్షసుడిలా కనిపిస్తుందతనికి విధ్వంసానికి వినాశానికి లోనైన పరిపూర్ణ యాంత్రిక చాలనంలో, జీవరహితమైనా వేగంతో నేటి ఆధునిక మానవుని ఉనికి పరిభ్రమిస్తూ పరుగులు తీస్తూ ఉంటుంది. రచయిత దృక్కోణం ఈరచనలో ప్రగాఢమైన అభివ్యక్తిని పొందింది. ఆ ఇతివృత్తమే సర్వనాశకమైనది.

సర్వసాధారణంగా మానసిక సమస్యలతో నిండిన పిరండెల్లో నాటకాల నేపథ్యమిది. వర్తమాన శకంలోని వెగటుతనం ఆయన నాటకాల్ని ప్రభావితం చేసింది. ఆ నాటకాలలోని నైరాశ్యతత్త్వానికి రచయిత ప్రకృతి భూమిక అయింది.

పిరండెల్లో తన నాటక సముచ్చయానికి పెట్టిన **'Maschere Nude'** (నగ్నావగుంఠనాలు 1918-21) అనే పేరు అనువాదానికి లొంగదు. ఆ శీర్షికలోని సంక్లిష్టత అలాంటిది. అక్షరానువాదంలో ఇది **'Naked Masks'** (నగ్నావగుంఠనాలు)గా కనిపిస్తుంది. **'Masks'** అంటే 'ముసుగులు' అని అర్థం. ఈనాటకాల్లో ఈ పదం ఒకరిని ఇతరుల నుండి మరుగు పరచేదిగా మాత్రమే కాక అగమ్య అగాధ తలాలోనికి అస్తిత్వాన్ని మరుగుపరచే ఆత్మావరణంగా కూడా కనిపిస్తుంది. ఆయన తన నాటకాలలో మనుష్యుల ముసుగుల్ని తొలగిస్తాడు. మానవ మనస్తత్వంలోకి చొచ్చుకుని పోయిన విశద దర్శనంతో విశ్లేషించి పరిష్కరిస్తాడు. ఆ పదబంధంలోని అంతరార్థ మది.

మానసిక విశ్లేషణను గొప్ప రంగ ప్రసాధనంగా మలచగల మాంత్రిక శక్తి పిరాండెల్లో నాటక కళలోని గణనీయమైన లక్షణం. నాటకాల్లో సాధారణంగా మూసకట్టు మనుష్యులుంటారు. పిరండెల్లో నాటకాల్లో మనిషి జాడ నీడలా ఉంటుంది. తెర వెనుక తెరలా ఉంటుంది. అవునూ - కాదూ ఆ వెనుక నున్న కీలకమేమిటో నిర్ణయించడ మెవ్వడికీ సాధ్యం కాదు. చిట్టచివరకు నెత్తి మొత్తుకుంటూ అక్కడ కీలకమంటూ, కేంద్రకమంటూ ఏదీ లేదనుకుంటాడు. ప్రతిదీ సాపేక్షమైనది. పూర్తిగా ఏదీ అర్థం కాదు. అయినా పిరండెల్లో నాటకాలొక్కప్పుడు ప్రపంచమేధావుల్ని పట్టి, ఊపి, పరవశింపజేస్తాయి. ఈ ఫలితమొక పరిపూర్ణ విరోధాభాసము. తనను చెరబట్టిన, వస్త్రగళితం చేసిన ఊహల్లోంచి జారిపడ్డ జీవన ప్రతిమలలోంచి ఉద్భుద్ధమైన రచనలుగా పిరండెల్లో తన నాటకాలను గూర్చి వివరించాడు. చాలా మంది ఇక్కడ ప్రతిమ వెనుకనున్న నైరూప్య భావం మౌలికమైనదని భావిస్తారు. అలాకాదు నిజానికిక్కడ ప్రతిమే మౌలికమైనది.

మమత్వంతో కూడి వ్యక్తిత్వపు మాయాప్రకృతి అనే ఊహామాత్రమే పిరండెల్లోలో ఉన్నదని అంటారు. ఆ ఆరోపణ సులభంగా నిరూపితం కాగలదు. ఆ ఊహ రచయితను పట్టి పీడించింది. మనిషి తాను దర్శించిన అవగతం చేసుకున్న ప్రతివిషయానికి సాపేక్షంగా ఈ ఊహ విస్తరించినట్లైతే ఆ ఆరోపణ అనుచితమైన దవుతుంది.

మొదట్లో పిరండెల్లో నాటక కళ సాధారణ సాహిత్య లక్షణాలకు దూరం కాలేదు. చెక్కు చెదరని గౌరవ ప్రతిష్ఠల కోసం పాకులాడే కుటుంబ జీవనానికి సామాజిక చట్రానికి నడుమ తలయెత్తే సామాజిక నైతిక సమస్యలు వ్యతిరేక శక్తుల నుండి ఉదాత్త మానవత్వాన్ని కాపాడు కోవడంలో ఎదురయ్యే కష్టాలు ఆ నాటకాల్లో కనిపిస్తాయి. నైతికమైన తార్కికమైన చిక్కుల్లో ముడిపడ్డ ఈవిషయాలన్నీ గెలుపుతోనో, ఓటమితోనో ముగిసేవి. ఈ సమస్యలన్నీటితో పోరాటం సలిపే సహజ సాపేక్ష ప్రతిపక్షి పిరండెల్లో నాటకాలలోని భూమికలను విశ్లేషిస్తే కనిపిస్తాడు.

పిరండెల్లో రాసిన చాలా నాటకాల్లో వ్యక్తిత్వము - దాని మూలంగా అనుభవించే ఫలితము ప్రధాన వస్తువుగా ఉంటుంది. మనం ఇతరులకు ఏ మేరకు తెలుస్తామో, మనకూ ఇతరులు ఆమేరకే తెలుస్తారు. కాని మనం ఎదుటివారి విషయంలో నిస్సందిగ్ధమైన తీర్పులు చెప్తూ ఉంటాం. ఆ తీర్పుల ఒత్తిడి ఎదుటివారి ఆంతర్యాన్ని మార్చెయ్య వచ్చును. **All for the best** (అంతా మన మంచికే) అన్న నాటకంలో ఈ మానసిక వ్యవహృతి దాని ముగింపు వరకు కొనసాగింది **'To clothe the Naked'** అన్ననాటకంలో కీలక వస్తువు తలక్రిందులై ఒక విచలిత విషాద భూమికను తలపింప జేసింది. ఆశలన్నీ అడుగంటి చావును కోరుకున్న ఒక భగ్న జీవితం, ఒక్కసారి బుద్ధి మార్చుకుని, ఇతరులు తాను బాగా ఉన్న రోజుల్లో తనను గూర్చి చెప్పిన అందమైన మాటల్ని తన మీద కప్పుకోవాలనే దయనీయమైన కోరికకు లోనయింది. గుండెల్ని పిండే ఈ నాటకంలో దురంత వేదన కారణంగా అబద్ధం కూడా ఒకరకమైన అమాయికతలాగే కనిపిస్తుంది.

అయితే రచయిత ఇక్కడితో ఆగిపోలేదు. అనేక నాటకాలలో ఆయన సాపేక్ష ప్రపంచంతో సంవదించే అబద్ధాన్ని నిశిత తార్కిక దృష్టితో పరీక్షించి ఆ అబద్ధంలోని నేర స్వభావం ఎటువంటిదో నిర్ణయిస్తూ వచ్చేడు. పిరండెల్లో నాటక కళలోని ముఖ్య సమస్య అహంకార విశ్లేషణ, విరుద్ధ శక్తుల మధ్య దాని విశ్లథస్థితి, దాని ఐక్య సంఘటన కేవలం భ్రమాత్మకమనే తృణీకరణము, న్యూనవ గుంఠనాల ప్రతీకాత్మక వర్ణనలతో కూడినదిగా కనిపిస్తుంది. జీవనది వంటి తన సృజనశక్తితో ఆయన ఈ సమస్యను భిన్న భిన్న పార్శ్వాల నుండి ఎదుర్కొన్నాడు.

ఉన్మాదపు అగాధాలను ఘోషింప జేస్తూ ఆయన ముఖ్యమైన విషయాలను కనుగొన్నాడు. ఉదాహరణకు **'Henry IV'** అనే విషాదాంత నాటకంలోని బలీయమైన అను భూతులన్నీ అనాదిగా ప్రవహించే కాలపు వెల్లువలో ఒక వ్యక్తి తన వ్యక్తిత్వపు గుర్తింపు కోసం పడే యాతనలోంచి పుట్టు కొస్తాయి. **'The Rules of the Game'**లో పిరండెల్లో పరిపూర్ణ అన్యాసక్తత నుండి నాటకాన్ని

సృష్టించేడు. బలీయమైన సామాజిక సంప్రదాయ తర్క కర్కశత్వానికి కట్టుబడ్డ వ్యక్తులు విధినిర్వహణలో ఆశించిన దానికి పరిపూర్ణంగా వ్యతిరేకంగా ప్రవర్తించడానికి తగిన కృతకమైన అభిప్రాయాల నిందులో ఉపయోగించేడు. ఇంద్రజాలికుని హస్త స్పర్శ సోకినట్లుగా ఈ పరధ్యాన క్రీడ దృశ్యాన్ని జీవితపు బిగి కౌగిలితో నింపుతుంది.

'Six Character in Search of an Author' అనే నాటకం కూడా 'Henry IV' లాంటి క్రీడే - అయినా దాని కంటే పూర్తిగా విరుద్ధమైనది. అది అత్యంత గంభీరమైనది. ఊహలతో ఉక్కిరి బిక్కిరి చేసేది. ఇందులో అభూత కల్పనలను విశృంఖల సృజనాత్మక భావవైభవం అధఃకరిస్తుంది. ఇది కవిత్వ సృష్టి నిండిన నిజమైన నాటకం. నిజానికి నాటకానికి మధ్య లెక్కలు తేల్చుకున్న నాటకమిది. రూపానికి నైజానికి మధ్యనున్న తెర తొలగించిన నాటకం. నిరసన నినాదాలతో విస్ఫోటనాలతో చెల్లాచెదరైన వినాశ కాలపు ఆత్మకు కళ అందించే అర్థ నిరాశా సందేశమీనాటకం. ఈ అనుభూతి కల్లోలం, శిఖరారోహణ చేసిన మేధ కవిత్వ సంపద - ప్రజ్ఞను మేలుకొలుప గలవు. అసామాన్యమైన ఈ నాటకం ప్రపంచవ్యాప్తి పొందడంలో అసామాన్య విజయాన్ని సాధించింది. ప్రపంచాన్ని మంత్ర ముగ్ధం చేసిన ఆ నాటకపు వివరాలను చెప్పడమిక్కడ అవసరమూ కాదు, అందుకు సమయమూ కాదు.

నిత్య శంకిత మనస్తత్వంపై ఆధారపడి పిరండెల్లో సృష్టించిన ప్రముఖ నాటకాలు పూర్తిగా వ్యతిరేకదిశలో ఉన్నాయి. సరికొత్త, సాహసోపేతమైన ఊహలపై ఉద్ధీనం చేయగోరే సామాన్య ప్రజానీకం తమ సహజ మౌఢ్యంతో వాటిని తమకు వర్తింప జేసుకుంటే తప్పకుండా చిక్కుల్లో ఇరుక్కుంటారు. కాని అలా జరిగే ప్రమాదమేమీ లేదు. ఈ నాటకాలు బుద్ధి జీవుల ప్రాంగణాల్లోనే పోరాడుతాయి. ఒకరో ఇద్దరో మామూలు మనుషులక్కడ కాలు మోపితే మోపుతారు. అదృష్ట వశాత్తు ఎవడో ఒకడు ఈ నాటకాల్లోని ''నేను''ను కేవలం కల్పనే అని గుర్తిస్తే ఆచరణలో ఈ ''నేను'' ఎంతో కొంత వాస్తవమేనని వేగంగానే సమాధాన పడతాడు. ఇచ్ఛా స్వాతంత్ర్యాన్ని అరికట్టడం దుర్ఘటమని అనుభవ పూర్వకంగా ఋజువైనట్లే, ఈ ''నేను'' కూడా తనను తాను జ్ఞప్తి చేసుకునే బహిరంగ మార్గాలను కనుక్కొంటుంది. ఈ మార్గాలు దూష్యంగాను దుర్గమంగాను ఉంటాయి. అందులో మరీ దుర్గమమైనది ''నేను' ధ్వంసం చేయ దలచిన భావనావ్యాపారం కావచ్చును.

పిరండెల్లో విశ్లేషణ గొప్ప విలువైనది. ఆయన మానసిక విశ్లేషణ మనను ఆనందోత్సాహాలలో ముంచెత్తి గుర్రాటు కలిగిస్తుంది. పవిత్ర హృదయులంతా వాటిని ఆరాధ్యమూర్తులుగా అతిమేలిమైన భక్తితో కొలుస్తారు. దృశ్య సాక్షాత్కార సామర్థ్యంగల భావుకునికి అవి నీటికి పట్టిన నాచులా కనిపిస్తాయి. ఆ నాచులో ధ్యానం చేసే చిరుచేపలు తలలొకసారి పైకెత్తి మునిగి అదృశ్య మౌతాయి. పిరండెల్లో నిత్య శంకిత లక్షణం మనల నిలాంటి సాహసాల జోలికి పోకుండా కాపాడడంలో సహాయకారిగా ఉంటుంది. మానవుని ఆత్మలోని సుకుమారభాగాలను ముష్కరంగా పిడివాదంతో అంధమార్గంలో స్పృశించ వద్దని ఆయన మనను హెచ్చరిస్తాడు.

నైతిక వాదియైన పిరండెల్లోలో విరోధాభాసమూ లేదు. విధ్వంసమూ లేదు. మంచి మంచే, చెడు చెడే. మానవసమాజం విషయంలో ఒక పురాతన మానవతా వైఖరి ఆయన ఊహలలో ఉద్వేగంగా ఉంటుంది. ఆయనలోని అత్యంత నైరాశ్యవాదం ఆయన ఆదర్శ వాదాన్ని అణచిపెట్టలేదు. ఆయన విశ్లేషణాత్మక హేతుకల్పన జీవన మూలాలను చేదించలేదు. ఆయన ఊహా ప్రపంచంలో సుఖ సంతోషాలకు ఎక్కువ చోటు దొరకలేదు. కాని ఉదాత్త జీవన పరిమళాల నా ప్రపంచం నిండా పీల్చుకోవచ్చును.

పిరండెల్లో మహాశయా! మీ అద్భుత సాహిత్య వ్యాసంగాన్ని కుదించి పరిచయం చేయవలసిన అసాధ్యకృత్యానికి నేను తలపడ్డాను. ఈ సంక్షిప్త చిత్రం అసమగ్రమైనదైనా నాకర్తవ్యాన్ని సంతోష పూర్వకంగా నిర్వహించేను.

స్వీడిష్ అకాడమీచే గుర్తించబడిన యోగ్యత గల మీరు, ఘనత వహించిన మా చక్రవర్తుల చేతిమీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరింపవలసినదిగా కోరుతున్నాను.

జీవిత చరిత్ర

లూయిజి పిరండెల్లో (1867-1936) సిసిలీలోని గిర్జెంటీ (Giregenti)లో పుట్టేరు. ఆయన రోమ్‌లోను, బాన్‌లోను తత్త్వశాస్త్రాన్ని అభ్యసించేరు. తన స్వగ్రామంలోని మాండలికం మీద ఒక విపుల రచనచేసేరు (1891). 1897 నుండి 1922 వరకు రోమ్‌లోని Real Istuto di Magistere Femminileలో సౌందర్యశాస్త్రాన్ని, శైలీశాస్త్రాన్ని బోధించేరు. ఆయన ఎన్నో నవలలు రాసేరు. అవి 15 సంపుటాలలో ఉన్నాయి. (1922-37) The Late Mattia Pascal (1904), The Cold and the Young (1913), Shoot (1916), One, None, and a Hundred Thousand (1926) అనే నాలుగూ ఆయన నవలలలో ప్రసిద్ధిచెందిన ఆరింటిలో మరీ ముఖ్యమైనవి.

నవలలు రాసినా పిరండెల్లో గొప్పనాటక కారుడుగా ప్రసిద్ధిని సాధించేడు. 'నగ్నావగుంఠనాలు' (Naked Maskes) అన్న పేరుతో వెలువడ్డ 1918 - 1935 మధ్య రాసిన నాటక సముచ్చయంలో ఎన్నో నాటకాలున్నాయి. Right you are (1918), To Clothe the Naked (1923), Henry IV (1922), The Life I gave you (1924), Six Characters in Search of An Author (1921) అనేవి ఆయన నాటకాలలో ప్రముఖమైనవి.

1908 లో పిరండెల్లో రాసిన Humour అనే వ్యాసం ఆయన నాటకాలలో అభివ్యక్తమైన రీతులకు పునాదివంటిది. ఆయన పాత్రలు ఆత్మైక పరాయణ ప్రవృత్తి నభిలషించేవి, జీవితంచే ఓటమి పాలైనవి, నిలుకడ లేక క్షణానికోలా మారుతూ తమ తృతీయపంథాను తాము వెల్లడించుకునేవిగా ఉంటాయి. జీవితంలో నిబిడీకృతమైవున్న వైరుధ్యాల నుండి ఉద్గమించే వ్యంగ్య విలాసం పిరండెల్లో హాస్యసృష్టికి మూలం.

వైవస్వత మనువు రూపుదిద్దిన ఈజిప్టు - సప్తసింధు నాగరికతలు

- డా॥ ఎం.వి. ఎన్. కృష్ణారావు

17-12-2000 తేదీగల 'The Statesman' లో The Harappan Riddle అనే పేరుతో రామకృష్ణ మిషన్‌కు చెందిన స్వామి ముఖ్యానంద ఒక వ్యాసం రాశారు. అందులో అనేకమంది పురావస్తు శాస్త్రవేత్తలను ఉటంకిస్తూ, సింధు నాగరికత వైదికార్యుల నాగరికత కొనసాగింపు తప్ప అన్యం కాదని రుజువైందని రాశారు. ఉటంకించిన శాస్త్రవేత్తలలో ప్రస్తుత వ్యాసరచయిత డా. M.V.N. కృష్ణరావు గూడ ఉన్నారు. అందువలన మేము "మీ ప్రతిస్పందన ఏమిటి?" అని డా॥ కృష్ణరావును అడగడం జరిగింది. వారు సప్తసింధు నాగరికత వేదకాలపు ఆర్యుల సంస్కృతికి దాదాపు వేయి సంవత్సరాల ముందుందనీ, ఆ సంస్కృతి నాలుగు జాతుల - తురానియన్, సెమిటిక్, హైమటిక్, ఆర్యుల - సమ్మేళనమని వివరిస్తూ ఈ వ్యాసం రాశారు. ఈ నాలుగు జాతులలోని ఆర్యులు తరువాతి ఆర్యుల కంటే భిన్నమైన వారని గమనించాలి. బండి ముందు పెట్టి గుర్రాన్ని వెనక కట్టి లాగించే ముఖ్యానంద అభిప్రాయాలను ఖండించడం జరిగింది. - సం.

సింధు లిపి పరిష్కారం

1969 సంవత్సరంలో నేను సింధు లిపిని శాస్త్రబద్ధమైన రీతిలో పరిష్కరించిన తర్వాత, ఎంతో కాలంగా పండితులు కుతూహలంతో ఎదురు చూసిన ప్రశ్నలకు సమాధానాలు దొరికినై. ఆనాటి ప్రజలు ఎవరు? వారు మాట్లాడిన భాష ఏది?. వీటి సమాధానాల కోసం దాదాపు అర్ధశతాబ్దం పైగా ప్రపంచంలోని పండితులు ప్రయత్నించి విఫలులైనారు. దానికి కారణం - ముద్రికల్లో పదాలు అతి చిన్నవిగా వుండి భాషాపరమైన విశ్లేషణకు ఆస్కారం లేకపోవడం. ఇంకా రెండు భాషల్లో శాసనాలు దొరకకపోవడం. ఇది మానవుని మేధస్సుకు ఒకగొప్ప ఛాలెంజ్ అని నిస్పృహచెంది దాదాపు అందరూ ప్రయత్నాలు మానుకున్నారు.

పసుపతి ముద్ర ఇచ్చిన క్లూ

అదే సమయంలో నేను స్కూల్ ఆఫ్ ఆర్కియాలజీలో శిక్షణ పొంది అదే నాగరికత కన్పించిన రాజస్థాన్‌లోని కాలీబంగాలో టెక్నికల్ అసిస్టెంట్‌గా తవ్వకాలు జరపడంలో నిమగ్నమై వున్నాను. ఆ అనుభవంతో ఏమైనా దానిని సాధించాలనే పట్టుదలతో దానికి సంబంధించిన గ్రంథాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి 'పశుపతి' అని ప్రఖ్యాతి చెందిన ముద్ర (మూడవ అట్టపై చూడుడు) ఆధారంతో 'ప్రిన్సిపుల్ ఆఫ్ ఎక్రోనోఫోనీ' అనే అతిప్రాచీన కాలం నుండీ ఈజిప్టు దేశస్థులు, హిట్టైట్ ప్రజలు వాడుతున్న పద్ధతిననుసరించి, ఆ ముద్రలోని సంకేత అక్షరాలను ఛేదించి 'మఖనాశన' గా చదివాను. దానిని రుజువు చేసుకోవటానికి, ఇంకా అనేక ముద్రికల్ని మిగతా పద్ధతుల ద్వారా కూడ చదువగలిగాను. దాని ఫలితంగా 1982వ సంవత్సరంలో నేను వ్రాసి ముద్రించిన గ్రంథం 'ఇన్‌డస్‌స్క్రిప్ట్ డిసైఫర్డ్'

డా॥ యమ్.వి.యన్. కృష్ణరావు భారత పురాతత్వ సర్వే శిక్షణా శాఖలో డిప్యూటి సూపరిండెంట్, ఆర్కియాలజిస్టుగా పనిచేసి 1988లో రిటైరైనారు. హైదరాబాదులో ఉండి ఇంకా సింధు లిపి పై పరిశోధన కొనసాగిస్తున్నారు.

తొలి కృషి:

ఈ పుస్తకంలో చాలా సందేహాలు తీర్చగలిగాను. కాని ఆనాటివారు వాడిన గుప్త సంకేతాలు, ఐడియోగ్రామ్స్, డిటర్మినెటివ్స్ లాంటివి పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. ఇంకా, వారు పదాలను రాసిన పద్ధతుల్లో వున్న మెళకువలను కూడ అప్పటిలో తెలుసుకోలేకపోయాను. అలా ఇక ఏవిధమైన అసంధిగ్ధతకు ఆస్కారం లేని పద్ధతిలో ఆ లిపిలో వున్న రహస్యాలను తెలుసుకునే ఉద్దేశ్యంతో మళ్లి 1982వ సంవత్సరం నుండి ఈనాటి వరకూ, ప్రభుత్వం నుంచి గానీ ఇతర సంస్థల నుంచి గానీ ఏ విధమైన ప్రోత్సాహాలు, సహాయాలూ లేకుండానే కృషి చేసి సఫలీకృతుడనైనాను. నా ఆరాటం ఒక్కటే. నాకు తెలిసిన విజ్ఞానాన్ని నా తోటి ప్రజలకు పంచటం.

మలి కృషి:

కాలీబంగా (రాజస్థాన్) లో 1960వ సంవత్సరం నుండి 1970వ వరకూ జరిపిన తవ్వకాలలో చాల ముఖ్యమైన ముద్రికలు ఎన్నో లభించాయి. ప్రభుత్వం వారు త్రవ్వకాలపై రిపోర్టును ప్రచురించలేదు ఈ రోజువరకూ. అందువలన ఆ ముద్రికల్ని అతి గోప్యంగా వుంచారు. అధమం అక్కడ దొరికిన ముద్రికల్ని అయినా ప్రచురించమని పండితులు తెచ్చిన ఒత్తిడి మూలంగా శ్రీ జె.పి. జోషి, ఒక ఫిన్నిష్ పండితుని సహాయంతో, ఇంత వరకూ మన దేశంలో లభ్యమైన సింధు ముద్రికలను 'యునెస్కో' సహాయంతో ప్రచురించారు. తత్ఫలితంగా మరికొన్ని ముద్రికలు నా పరిశీలనలోకి వచ్చాయి. వాటిలో 'రామసన' ముద్రికను చదివి, రామసన - రామచంద్ర ఒక్కరేనని కాలీబంగాయే అయోధ్య అయి వుండవచ్చునని మీడియా ద్వారా ప్రజలకు తెలియచేశాను. ప్రజలు దానిని ఉత్సాహంతో స్వీకరించారు. అందువలన బహుముఖంగా వారి మన్ననలను పొందాను. కృతజ్ఞుణ్ణి.

ప్రస్తుతం అతిముఖ్యమైన చిత్రఫలకంను గురించి ప్రస్తావిస్తాను.

నార్మెరు ఫలకం



FIG. 33.—THE NARMER PALETTE
From J. E. Quibell, in Zeitschrift für ägyptische Sprache, xxxvi (1898), pls. xii f.

కాలీబంగాలో 'K. 76' లభించింది. ఇది ఒక చిన్న రాతి ఫలకంపైన చెక్కిన అతి ముఖ్యమైన చారిత్రక సంఘటనను వివరిస్తుంది. ఇలాంటి చెక్కడాల్లో ఈజిప్టులో మొదటి రాజవంశం నుండి ఐదవ రాజవంశం వరకూ ప్రతి సంవత్సరం జరిగిన అతి ముఖ్య సంఘటనలను చిత్రీకరించారు. అలాంటి గ్రానైటు ఫలకాలు ఆరు పాలెర్మో మ్యూజియంలో ఉంచబడ్డాయి. వాటిలో 'నార్మెల్‌పాలెట్' అతిముఖ్యమైనది. ఎందుకనగా ఆ రాతిమీద వున్న చిత్ర సంకేతాలకూ, కాలీబంగలో దొరికిన ఫలకం పైన చిత్ర సంకేతాలకూ చాల దగ్గర పోలిక వున్నది. ఈ రెండూ ఈజిప్టులో మొదటి రాజవంశానికి చెందిన 'నార్మెర్' (మన) దిగ్విజయ యాత్రని తెలియజేస్తాయి. నార్మెరుకు ముందు ఈజిప్టు మొత్తాన్ని పాలించిన రాజులెవరూ లేరు. నైలునదికి దిగువన వున్న డెల్టా ప్రాంతపు రాజులకు - ఎగువనున్న ప్రాంతాల రాజులకూ అతి తరచుగా యుద్ధాలు జరుగుతూ వుండేవి. అప్పుడు నార్మెర్, భూలోకంలో సూర్యుని అవతారమైన 'హోరస్' డేగ సహాయంతో ఘోరమైన యుద్ధంలో డెల్టాలోని రాజ్యాలను జయించి రెండు ఈజిప్టు ప్రదేశాలను కలిపి ఏకం చేస్తాడు. అలా ఏకం చేసిన ప్రథమ

వీరుడిగా చరిత్రలో నిలిచిపోయాడు 'నార్మెర్'. అంతే కాదు, ఈ విజయంతో ఈజిప్టు రాత్రికిరాత్రి మహావికాసాన్ని పొందింది. అన్నివైపులా అభివృద్ధి చెందింది. ప్రజల్లో నూతన ఉత్సాహం పొర్లిపొంగింది. రాయడం మొదటిసారిగా కనుగొన్నారు. నాగరికతకు నిజమైన అర్థం చెప్పారు.....

మెంఫిస్ రాజధాని.

రెండు ఈజిప్టులకు మధ్యగావున్న ప్రాంతంలో నైలునది మలుపు తీసుకున్న చోట కొంత భాగాన్ని మెరక చేసి అక్కడ ఒక కోటను, రాజ ప్రాసాదాన్ని కట్టించాడు. ఇది 'వైట్ వాల్స్' గా ప్రసిద్ధిచెందింది. తర్వాత అక్కడే 'మెంఫిస్' City తన రాజధానిగా చేసుకుని, షుమారు 80 సంవత్సరాల వయసు వచ్చేదాక రాజ్యం చేశాడు. చివరికి హిప్పోపొటెమస్‌తో పోట్లాడుతూ చనిపోయాడని చెప్పబడింది. డెల్టాలోని రాజ్యాలను జయించాక తన శేష జీవితాన్ని నైలునదికి తూర్పు భాగంలో వున్న ఎడారి ప్రాంతాల్ని జయించటంలో నిమగ్నమయినాడు. సప్తసింధు కూడా ఈజిప్టుకు తూర్పు భాగంలోనే కదా వున్నది.

వైవస్వత మనువు



కాలీబంగా ఫలకంలో ఎడమ నుంచి కుడికి వరుసగా - ఎద్దు, గరుడపక్షి తనకాలితో ఎత్తుగా వున్న కొండమీద వున్న వట వృక్షాన్ని పట్టుకొని ముందుకు లాగుతున్నది. దాని అర్థం పర్వతమయమైన వన ప్రాంతాన్ని 'హోరస్' అనగా సూర్యుని ప్రతినిధి అయిన గరుడపక్షి, పోరాడుతున్న ఎద్దు రూపంలో వున్న ఈజిప్టు రాజుకు, 'వన' అనే రాజ్యాన్ని బహూకరిస్తున్నది. 'వన' అనేపదం, 'అక్రోఫోనీ' అనే సూత్రం ఆధారంగా వట వృక్షం నుంచి మొదటి అక్షరం 'వ' ను 'నగ' (అంటే పర్వతం) నుండి 'న' కలిపి పలికితే, ఏర్పడిన పదం. సప్తసింధు లిపి ఇలాంటి చిత్ర సంకేతాలతోనే ప్రారంభమయింది. సరిగ్గా ఇలాంటి సంకేతాలు, పాకిస్థానులో వున్న పంజాబు ప్రాంతంలో క్రీ. పూ. 5000 సంవత్సరములకు చెందిన మట్టిపాత్రలపైన కూడా కన్పించినాయి. ముఖ్యంగా ఇక్కడ కొండను సూచించే సంకేతము అక్కడ కూడా కన్పించింది. 'వన' అనే రాజ్యం సప్తసింధు (సరస్వతి నది సప్తసింధులో ఒక భాగం) ఉత్తర భాగాన వున్నదని అర్థం - ఈ 'వన' రాజ్యాన్ని ఈజిప్టు రాజైన 'నార్మెర్' జయించి తన తదనంతరం అక్కడ కాలీబంగా ప్రాంతమైన అయోధ్యను పాలించిన సూర్యవంశపు రాజులైన ఇక్ష్వాకులకు మూలపురుషుడైనాడు. అంతేకాదు మన పురాణాల్లో చెప్పబడ్డ రాజవంశాలన్నింటికీ మూల పురుషుడైనాడు ఈ వైవస్వత మనువు, అనబడే 'నార్మెర్'. నార్మెరు ఈజిప్టు డెల్టా ప్రాంతాల్ని జయించిన సంఘటన 'నార్మెరు ఫలకం' లో చూపబడింది. అక్కడ హోరస్ (గరుడపక్షి) డెల్టాకు సంకేతమైన 'పాపిరస్' (కాగితం) మొక్కతో వున్న ప్రాంతానికి ముందువున్న శిరస్సును ముక్కు తాడుతో నార్మేరుకు బహూకరిస్తోంది. అక్కడ కూడా రాజును పోరుతున్న ఎద్దుగా ఫలకం క్రిందివైపు చూపారు. అక్కడి ప్రజలు 'అను' అనె సెమెటిక్ జాతికి చెందినవారు.

నార్మెరు (మను)

నార్మేరు ఈజిప్టు దిగువ డెల్టా ప్రాంతపు రాజ్యాలను జయించి అంతకు ముందే జయించిన ఎగువ రాజ్యాలతో ఏకం చేసి, మొత్తం ఈజిప్టును సప్తసింధును పాలించిన మొట్టమొదటి చక్రవర్తిగా ప్రపంచ చరిత్రలో వెలుగుతున్న తారగా శాశ్వతంగా ఉండిపోయాడు.

ఈజిప్టు భాషలో 'నార్' అంటే చేప 'మేర్' అంటే ఉలి (రూపుదిద్దటం అని భావం) ఈ రెండింటినీ కలిపి పలికితే 'నార్మెర్' అవుతుంది. ఈ 'నార్మెర్' అన్నది రాజు బిరుదులో ముఖ్యమైన హోరస్ (గరుడపక్షి) పేరు. దీనినే పతాక (బేనర్) నామం. దానికే 'క' నామం అంటే రాజు యొక్క డబుల్. (ప్రతిబింబం - ఆత్మ) అంటారు - ఈ 'క' అనేది రాజు పుట్టినప్పుడు అతనితోపాటు వస్తుంది. - చనిపోయినప్పుడు అతనితో కూడా వెళ్లక అలా మిగిలిపోతుంది. ఇక 'మనెస్' 'మన' అనికూడ పిలుస్తారు. ఇది రాజు యొక్క స్వంత నామం (Personel Name) మంత్రతంత్రాలు చేసి రాజుకు అపకారం తలపెడతారన్న భయంతో ఈ స్వంత పేరును బహిర్గతం చేయరు. ఈజిప్టులో 'నకడ' అనేచోట అతని సమాధిలో చిన్న దంతపు ఫలకం మీద ఈ మెన అని రాసి వున్నది. ఈ సమాధిలోని ఇంకొక భాగంలో దొరికిన టాయిలెట్ వస్తువులపై నార్మెరు కుమార్తె పేరు లిఖించబడ్డది. ఆ పేరు కూడ ఒక ముద్రికపై లోథాల్ (ఇండియా) లో బయట పడ్డది.

నార్మెరు - వైవస్వత మనువు: ఇద్దరూ ఒకరే:

ఈ ఇద్దరూ ఒక్కరే - వేరు వేరు కాదు అనటానికి నిదర్శనం, ముఖ్యంగా పైన వర్ణించిన (1) కాలీబంగా ఫలకం (2) నార్మెర్ ఫలకం. వాటిలో చిత్రించిన హోరస్ (గరుడ పక్షి) పోరుతున్న ఎద్దు (ఫేరో అంటే ఈజిప్టు రాజు)

సూర్యుని పూజించే ఆచారం ఈజిప్టుకు తూర్పు దేశాల నుంచి వచ్చిందని, 5వ రాజవంశపు రాజులు తమ పూర్వజులు 'పునెట్' అనే తూర్పు ప్రాంతం నుంచి వచ్చారని నమ్మారు. దానికి 'తనితర' అంటే 'దేవతల భూమి' అన్నారు. ఆ పున్‌ట్‌ను పున్ అని పలుకుతారు. చివర వున్న 'ట' పలకరు. ఆ విధంగా 'పునె' అని 'సాపున' అనే పదాలు సింధు ముద్రికల్లో చాలసార్లు కన్పించాయి. ఇంకా 'అమర్‌నా' అన్న ఆనాటికి చెందిన ఈజిప్టు ప్రాచీన నగరంలో లభించిన కీల లిపిలో రాజుని వుద్దేశించిన వ్రాతల్లో రెండు ప్రదేశాల పేర్లు 'సపున' 'సరన' వర్ణించారు. అని సింధు నాగరికతకి సంబంధించిన పట్టణాలని నా లిపి విశ్లేషణలో నిరూపితమైంది. సింధు ముద్రికల్లో 'రాజ, మన; రాజ నరమర' (మూడవ అట్ట పై చూడుము) అనే పేర్లు చాలాసార్లు కన్పించాయి. అలాగే తర్వాత ఈజిప్టు రాజుల పేర్లు కూడా ముద్రికల్లో వచ్చాయి. ఇంకా పూరాతత్వ తవ్వకాల్లో మొహెంజోదారో, హరప్పాలలో బయల్పడిన మట్టి పాత్రలు, రాతి పాత్రలు, రాగి ఆయుధాలు ఈజిప్టులో 'నార్మేరు' ఇంకా తర్వాతి వంశాలకు చెందిన కాలానివిగా గుర్తించడం జరిగింది.

'మను' అన్న పదం ఈజిప్షియన్ భాషలో అరుదుగా, కొత్తగా కన్పిస్తుంది. అదే భారత్‌లో విపులంగా వాడిన పదం. మనపురుణాల్లో మను మూలపురుషుడుగా ఎన్నో రాజవంశాలున్నాయ్. ఈజిప్టులో 'మను' తర్వాత అతని పుత్రులు గాని, వారసులుగాని రాజ్యం చేయలేదు. మను తర్వాత వరసగా అహ, జర, ధన, అని మొదటి రాజవంశపు రాజులు రాజ్యం చేశారు. వారికి మనుతో సంబంధం వున్నట్టు

తెలియదు. అందువలన మను భారత్ సంతతికి చెందినవాడే అని చెప్పవచ్చును. కాని ఈజిప్టులోనే తన జీవితకాలం అంతా గడిపాడు. అయినా వారికి మను పుట్టు పూర్వోత్తరాలు తెలియదు. భారత్‌లో అయితే మనును గురించి ఎన్నో వివరాలు తెలుసు. మను దక్ష ప్రజాపతి కుమార్తె అయిన అదితికి పుట్టిన వాడని అతని తండ్రి వివస్వంతుడని అందువలన మను ఏడవ మను వైవస్వతుడుగా పిలవబడ్డాడు. మను వైవస్వతునికి పూర్వం ఆరు మను యుగాలు గడిచాయని, వీరు వరుసగా 1) మన స్వాయంభువ 2) స్వారోచిషమను 3) మను ఉత్తమ 4) మను తమస 5) రైవత 6) మను చక్షుష. ఇన్ని వివరాలు 'మను' గురించి భారతీయులు చెప్పకలిగారు. కనుకనే మనువైవస్వత సప్తసింధుని జయించిన తర్వాతనే ఈజిప్టు జైత్రయాత్రకు బయల్దేరాడని చెప్పవచ్చు.

సరస్వతీ-దృషద్వతీ నదుల తీరాల్లో తొలి నాగరికత:

పురాతత్వ శాస్త్ర పరిశోధనల్లో, అక్కడ దొరికిన మట్టిపాత్రలు, వాటిపైన అలంకరణలు (డిజైన్లు), మరికొన్ని వస్తువుల ఆధారాలతో అక్కడ వున్న ప్రజలు ఇరాక్ నుంచి వలసవచ్చి స్థిరపడి చిన్న నగరాలు నిర్మించుకుని వ్యవసాయం ఆధారంగా జీవిస్తున్నవారని చెప్పవచ్చు. వారిలో తురానియన్లు, ఆర్యులు కలిసి మెలసి వుండేవారు. సుమేరియన్లు వీరితో, ఖనిజాలకోసం, ముడిపదార్థాల కోసం వ్యాపారం చేస్తుండేవారు. సుమేరియన్ల తాలూకు మట్టిపాత్రలు, డిజైన్లు వారు వాడేవారు. వీరు చిన్న చిన్న తెగలుగా ఏర్పడి నగరాల్లో నివసించేవారు. అలా వారు సరస్వతీ- దృషద్వతీ నదీతీరాల్లో నివాసం ఏర్పరుచుకుని దానికి బ్రహ్మావర్తం అని పేరు పెట్టారు. ఆ నగరాల మధ్య సయోధ్యత వుండేదికాదు. సరిగ్గా నర్మేరు దండయాత్రకు ముందు ఈజిప్టులో వున్న పరిస్థితే ఇక్కడ కూడ మనం ఊహించుకోగలం. జనాభా పెరుగుట వలన వారు క్రమంగ సప్తసింధు ఎగువ, దిగువ తీరాలన్నిటిలో చిన్న నగరాలు నిర్మించుకుని, వ్యాపారం, వ్యవసాయం ముఖ్యవృత్తిగా జీవించేవారు. ఇంకా రాయడం వారు నేర్వలేదు. వీరికంటే ముందు ఎవరూ ఆ నదీతీరాల్లో నివసించిన దాఖలాలు తవ్వకాలలో తెలియలేదు. వారి స్త్రీ శక్తిని (మదర్‌గాడెస్) మాతృదేవతగా పూజించేవారు చిన్న మట్టి విగ్రహాల రూపంలో. వారి భాష వేద సంస్కృత భాషకు దగ్గరగా వున్నప్రాకృత భాష కావచ్చు. అది మనం 'వన' అనే పదాన్ని సంస్కృతం ఆధారంతో పొందగలిగాము కనుక అని చెప్పవచ్చు. అక్కడ నివసించిన మొట్టమొదటి జనం ఆర్యులే కనుక, ఆ ప్రదేశానికి ఆ పేరు వారే పెట్టివుంటారు. ఆ ప్రాంతంలో మొట్టమొదట ద్రవిడ జాతిగాని, తురానియన్లుగాని, సెమిటిక్ ప్రజలుగాని వుండి వున్నట్టయితే మనకు 'వన' అనే పదం గురించి సమస్య వచ్చేది. కనుక ఆ ప్రదేశాన్ని 'వన' అని, అది సంస్కృతానికి దగ్గర భాష అనీ మనం ఊహించటంలో తప్పులేదు. తురానియన్లు ఆర్యులతో కలసిమెలసి ఉన్నారని చెప్పుకున్నామే గాని వారు ప్రత్యేక గుర్తింపుకోసం ప్రయత్నించలేదు. వీరు బలహీనమైన తెగ కనుక వారు అక్కడే ముందే స్థిర నివాసం చేసుకుని స్థిరపడిన అదే భూమికి చెందిన ప్రజ కూడా కాదు.

అయితే కేవలం వారు వాడిన మట్టి పాత్రల వల్లగాని, వాటిపైన వున్న డిజైన్లవలన కాని, వారువాడిన రాగి ఆయుధం వలనగాని వారు ఫలానా జాతికి చెందిన వారని నిర్ణయించటం కుదరదు. అలా నిర్ణయించటానికి మనకు వారు వదలిన ముద్రికలవల్ల వాటిలోని భాషవలన, దేవీ దేవతా మూర్తుల వలన వారిపేర్ల వలన మాత్రమే వీలవుతుంది. అవి లేనిపక్షంలో అనుశ్రోతంగా వస్తున్న వారు వదిలివెళ్లిన తొలిసాహిత్యం (అంటే ఇక్కడ వేదాలు) వలన, అక్కడ మొదట్లో నివసించిన వారు ఆర్యులే అని చెప్పగలం. అలా వారు మొట్టమొదటిగావలస వచ్చిన ప్రదేశంపేరు బహ్మావర్తమనీ, అది సరస్వతీ, దృషద్వతీ నదుల మధ్యప్రదేశమనీ మనకు తెలుసు. దానిని వారు 'దేవకృతయోని' అన్నారు.

సప్తసింధు నాగరికత:

నార్మేరు తన జైత్రయాత్రలో, సప్తసింధులో వున్న ఎన్నో రాజ్యాలను జయించాడు. తర్వాత వీటన్నింటినీ ఏకం చేసి తన నాయకత్వం క్రింద అభివృద్ధి చేశాడు. అలా అక్కడ రాత్రికిరాత్రి మహోజ్వలమైన నాగరికత వెలిసింది. ఆనాటి ఈజిప్టు, బాబిలోనియాలో నాగరికతలకన్నా, వైశాల్యంలోనూ, నగర, భవన నిర్మాణశిల్పంలోను, పరిశుద్ధతలోను చాలా గొప్పదని ఖ్యాతి గడించింది. అలా నదీ తీరాల వెంబడే ముఖ్యమైన వ్యాపార మార్గాల్లో మహానగరాలూ, రేవు పట్టణాలు నిర్మించబడ్డవి. అవి 1) మొహెంజోదారో (తవసవ. పవ), 2) హరప్పా (వన - సవన, యవివ), 3) కాలీబంగా వన - అయోధ్య (ధ్రధయయ), 4) లోధల్(మొదట్లో 'సన' తర్వాత 'ద్వారక') రేవు పట్టణం, 5) ధోలవీర (రిభ) రేవుపట్టణం.

ఇంత విశాలమైన రాజ్యమంతటా పరిపాలనా పద్ధతులు, భవన నిర్మాణ పద్ధతులు, ప్రజలు నిత్యం ఉపయోగించే వస్తువుల నాణ్యత మొదలైనవన్నీ పొల్లు పోకుండా ఒకే పద్ధతిలో వున్నవి.

సప్తసింధు నాగరికతా కాలం:

ఈ మహానాగరికత క్రీ. పూ. 2800 సంవత్సరము నుండి అనగా 'నార్మేర్' దండయాత్ర నుండి, క్రీ. పూ. 600 సం॥ వరకూ అనగా అస్సీరియా చక్రవర్తి అసురబనిపాల్ అస్తమయం వరకూ వర్ధిల్లింది. ఆనాటి నుండే ఆయా దేశాలను పాలించిన ముఖ్యమైన రాజుల పేర్లు అన్నీ సింధు లిపితో ముద్రికల్లో లభించాయి. అందువలన ఈ రాజుల పట్టికలలో మనకు తెలిసిన రాజవంశాలు, వారు పాలించిన కాలం ఎన్నో రెట్లు శాస్త్రీయం. ఇంకా నిజానికి ఎంతో దగ్గర అని నిర్భయంగా చెప్పగలను. అయితే రేడియో కర్బన్ డేటింగ్ ప్రకారం సింధు నాగరికత క్రీ.పూ. 2200 లో ఉదయించి క్రీ. పూ. 1750 లో అస్తమించింది. ఈ పద్ధతిన కాలాన్ని కొలవటం ఇంకా పరిపూర్ణత చెందలేదు. ఈ పద్ధతిలో నమూనాలు స్వీకరించటం దగ్గర్నుంచీ, వాటిని శాస్త్రీయంగా విశ్లేషించేవరకూ ఎన్నో ఒడిదుడుకులున్నాయి. అందువలన ఈ పద్ధతిని చారిత్రక అంశాలకు సంబంధించినంత వరకూ ఉపయోగించటంలో ఔచిత్యం లేదు.

రాయడం పద్ధతి: భాష, మతం:

నార్మేర్ దండయాత్రకు ముందే సప్త సింధులో చిన్న గ్రామాలు, నగరాలు, వుండేవని తెలుసుకున్నాం. అక్కడి ప్రజలు తొలి ఆర్య సంతతికి చెందిన పురోహితులు, ప్రభువులు, యోధులు, ఇంకా అనేక తెగలకు చెందిన పెద్దలు, నాయకులు ఉన్నారు. వారు మాత్రమే గాక ఇంకా వారి సమాజంలో వారితో బాటు కలిసిపోయి వారి దండయాత్రలలో వారిని అనుసరించి, ఆరాధించే తురానియన్ జాతికి చెందిన వారున్నారు. అమూర్రులనే (అమరులు) సెమెటిక్ జాతి ప్రజలు కూడా పలు ప్రదేశాల్లో ఆర్యులతో కలిసిమెలిసి వుండేవారు. ఒక విధంగా విశాల దృక్పథంతో చూస్తే - సుమేరియన్లు, ఈలామ్ ప్రజలు (ఇరాన్‌లో) ఈజిప్షియన్లు, ద్రవిడులు తురనియన్ జాతికి చెందినవారే. అప్పటికి, ఆర్యులు రెండు వర్గాలుగా ఇరానుకు చెందిన ఆర్యులని, వేదకాలపు ఆర్యులనీ విడిపోలేదు. ఇంకా వేదాలు ప్రచారంలోకి రాలేదు. వేద దేవతలు కూడ ప్రచారంలో లేరు. 'ఇంద్ర' అనే పదం చాలా ఆలస్యంగా 'ఇద్దర' అని 'ఇవ' అనే బాబిలోనియాకు చెందిన వాయుదేవునికి పర్యాయపదంగా

చూపబడ్డది సింధు లిపి ముద్రికలో. ఇంకా 'మఖనాశన' అని కూడ ఇంద్రునికి పర్యాయపదంగా చూపబడ్డది ఈ ముద్రికలలో - బహుశా ఇది కూడ చాలా ఆలస్యంగా వచ్చినవి కావచ్చు. 'వరుణ' దేవుని పేరున ముద్రికలు చాల విస్తారంగా లభించాయి. వరుణ దేవుణ్ణి అసురులదేవుడిగా వేదాల్లో చెప్పబడ్డది. మళ్లి 'పవన' 'పవ' అనే వాయు దేవుడు పేరు విస్తారంగా ఈ ముద్రికల్లో కన్పించింది. 'పవ' దేవుణ్ణి సుమేరియన్ల ముఖ్య దేవుడైన 'ఇయ' కు పర్యాయపదంగా చూపించారు సింధు ముద్రికల్లో. ఇవిగాక బాబిలోనియాకు చెందిన అనేకమైన దేవీ దేవతల పేర్లు విస్తారంగా ఈ ముద్రికలలో లభించాయి. అవి ఇలా ఉన్నాయి. నన, ఇష్టార్ (Sun goddesses); రి, యస, అనిథ (Sun Goddesess). రర, రణ, యయ, యన, దమ, సామ, సోనన, సన, సాన ననా (Sun Gods), నిన, వన, వర, పవ, శూర, ధరన, ఇవ (Thunder Gods) అంటే సప్తసింధు ప్రజల మతం నలుగురి మతం. అంటే సెమెటిక్, తురనియన్, హెమైటిక్ మరియు ఆర్యన్.

ఆర్యుల తొలి వలస:

పైన ఉదహరించిన దేవీ దేవతల పేర్ల వలన, ఆర్యులు సప్తసింధు లోనికి ప్రవేశించటానికి ముందు బాబిలోనియాలో చాలా కాలం, మొదట సుమేరియా ప్రజలతోను, తర్వాత అక్కడియన్, అమురు అనే సెమిటిక్ జాతి ప్రజలతోను, ఎలామ్ రాజ్యానికి చెందిన తురానియన్ జాతివారితోనూ కలిసి వున్నట్లు రుజువౌతుంది. ఇలా అన్ని జాతులతో కలసిమెలసి నివసించిన తొలి ఆర్యుల భాషకు, తర్వాత వచ్చిన వేదకాలపు ఆర్యుల భాషకు చాలా తేడా కన్పిస్తుంది. వేదకాలపు ఆర్యుల భాషలో శబ్ద స్వచ్ఛత కనిపిస్తుంది. తొలి ఆర్యుల భాషలో మాటలోని శబ్దాలను విడివిడిగా మాత్రలుగా సంధులు లేకుండా తేలికగా పలకటం లాంటివి కన్పిస్తాయి. ఇది నలుగురు వాడే భాష లాంటిది. తొలి ఆర్యులు బాబిలోనియా ప్రజలతో కలిసి మెలిసి వున్నారనటానికి నిదర్శనం - 'ఇసిన్' అనే రాజవంశంలోని దాదాపు 8 మంది ఆర్యజాతికి చెందిన రాజులు, 224 సంవత్సరాలు, Isin పట్టణం రాజధానిగా, సుమేరియానూ, బాబిలోనియానూ క్రీ. పూ. 1900 నుండి క్రీ. పూ. 1650 దాక పాలించారని చరిత్రచెబుతుంది. అలా అని బాబిలోనియా చరిత్రను గ్రీకు భాషలో రాసిన క్రీ. పూ. 3వ శతాబ్దానికి చెందిన బాబిలోనియన్ చరిత్రకారుడు 'బెరోసస్' తన గ్రంథంలో ప్రస్తావించాడు. అయితే 'బెరోసస్' వారిని ఇండియా దేశం నుంచి వచ్చిన ఆర్యుల తొలి వలసగా భావించాడు. ఈ 'ఇసిన్' (ఈశాన) పాలించిన రాజవంశంలోని రాజుల పేర్లన్నీ సింధు ముద్రికల్లో లభించాయి. (నాల్గవ అట్ట చూడుము) అంతేకాదు 'ఉర్' ను 'లార్సా' పట్టణాన్ని పాలించిన రాజవంశాల రాజుల పేర్లు కూడ సింధు ముద్రికల్లో లభించాయి.

పై ఆధారాలవల్ల సప్తసింధు పట్టణాలను పరిపాలించిన రాజవంశాలే బాబిలోనియాని కూడ పాలించాయని నమ్మవచ్చు. వారు అక్కడ మొదటలో నివసించారనటానికి, కొంతకాలంవారు అక్కడ పాలించారనటానికి నిదర్శనం, బాబిలోనియన్ భాషలో, లిపిలో ప్రతిసంకేతానికి ఇచ్చిన మూడు శబ్దాల్లో ఒకటి ఆర్య భాషకు చెందింది. ఉదాహరణకు ఇంటి సంకేతానికి వీరు 'ఎ' అనే శబ్దం సుమేరియన్ భాషకు చెందినది వాడితే 'బిత్' అనే శబ్ద సెమెటిక్ భాషకు చెందినది. 'మల్' అనే శబ్దం (మహల్) ఆర్యుల భాషకు చెందినది. ఈ మూడు శబ్దాలూ ఇంటిని సూచించే ఒక్క సంకేతాన్ని తెలియచేస్తాయి.

(ఇంకా వుంది)

ఇంద్రియాతీత శక్తులు

– ఎన్. ఇన్నయ్య

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

1969లో విజ్ఞానాభివృద్ధికి ఏర్పడిన అమెరికా సైన్సు సొసైటీ వారు పేరాసైకలాజికల్ అసోసియేషన్‌కు అనుబంధ సభ్యత్వం ప్రసాదించారు. హ్యూమనిస్ట్, కాగ్నిటివ్ సైకాలజి శాఖలు బయలుదేరి మోహనిద్ర, కలలు, ధ్యానం, తెచ్చిపెట్టుకునే విశ్రాంతి యిత్యాదులను అధ్యయనం చేశాయి. హెల్మెట్ షిమిట్ (Helmet Schmidt) కృషి ఫలితంగా అతీంద్రియశక్తుల పరిశోధనలలో పాత పావుల, కార్డుల పద్ధతుల స్థానే ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించారు. 1985లో ఇంగ్లండ్‌లో ఆర్థర్ కోస్లర్ పీఠాన్ని స్థాపించి పేరా సైకాలజీ అధ్యయనం ఎడిన్‌బరో యూనివర్శిటీ ఆరంభించింది. సమన్వయ పేరా సైకాలజీ పేరిట పీఠాధిపతి రాబర్ట్ మోరిస్ కొత్త ప్రతిపాదనలు తెచ్చాడు. పరిశోధకులు కొందరు పి.హెచ్.డిలు తీసుకున్నారు. ఇతర శాఖలతో సమన్వయం, శాస్త్రీయ పద్ధతులు కొత్త ప్రతిపాదనలలో చోటు చేసుకున్నాయి. రానురాను అమెరికాలోని డ్యూక్ యూనివర్శిటీ, ఇంగ్లండ్‌లోని ఎడిన్‌బరో యూనివర్శిటీ కూడా కొన్ని పేరా సైకాలజీ కేంద్రాల్ని మూసేయడం గుర్తించాలి. జె.బి. రైన్ అతని భార్య కూడా పేరా సైకాలజీ రీసెర్చి పేరిట దొంగ నివేదికలు, లెక్కల మోసాలు జరిగినట్లు గుర్తించారు. కొన్నాళ్ళు గుట్టు చప్పుడు కాకుండా వుంచినా చివరకు వారు భరించ లేక నిజాలు బయటపెట్టారు. పేరా సైకాలజీకి ఎదురు దెబ్బ తగిలింది. పేరా సైకాలజీ పరిశోధనలలో పాల్గొనే వ్యక్తులు తమకూ బయట ప్రపంచానికీ గల సంబంధాలను వివరించడంలో అనేక భ్రాంతులకు, దోషాలకు గురౌతున్నట్లు తెలిసింది. వీటిని నివారించి, పరిశోధించడానికిగాను, కొన్ని జాగ్రత్తలు వహిస్తున్నారు. తలవని తలంపుగా వచ్చిన అనుభవాలను రికార్డు చేసుకోవడం ఒక ముఖ్య దశగా వుంది. వ్యక్తి ఆలోచనలు, అనుభూతులు వెల్లడించినప్పుడు, వాటికి అనుగుణంగా బయట జరిగిన వాటిని జోడించి చూచుకోవడం యిందులో ప్రధానాంశం. వ్యక్తుల అనుభవాలను, జరిగిన సంఘటనలను క్షుణ్ణంగా పరిశీలించడం రెండో దశ. మూడోస్థాయిలో వ్యక్తుల అనుభవాలను, వారు చెప్పేవాటిని, తదనుగుణంగా బయట జరిగినట్లు చెప్పేవాటిని, పరిశోధనాలయంలో నిశిత పరిశీలనకు గురి చేస్తున్నారు. సైన్స్‌లో అన్వయించే పంథాలను పాటించడాన్ని, కంట్రోల్డ్ పరిశోధన అంటున్నారు.

ఇలాంటి పరిశోధనలు జరిపినప్పుడు పేరా సైకాలజి కొన్ని సమస్యల చిక్కులో పడక తప్పడం లేదు. ఒక వ్యక్తి తన అతీంద్రియ శక్తితో రెండో వ్యక్తి శరీరాన్ని ప్రభావితం చేశాడనుకుందాం. మొదటి వ్యక్తి దృష్టిలో అది సైకొకెనిసిస్ అయితే, రెండో వ్యక్తికి అది టెలిపతి అవుతుందా? అతీంద్రియ శక్తితో దూరాన వున్న వస్తువును కదలిస్తే, అలాంటి ప్రయోగాన్ని మళ్ళీ చేసి చూపించవచ్చా? భవిష్యత్తును ముందే చెప్పగల శక్తిని ఎలా పరిశోధనకు గురి చేస్తారు? ఇలాంటి ప్రశ్నలు చిక్కు సమస్యలుగా పేరా సైకాలజీలో మిగిలిపోతున్నాయి.

అతీంద్రియశక్తి వుంటే, శరీరంలో అది అంతర్గతంగా యిమడ్చగల అవకాశం వుందా? వుంటే పరిణామంలో మనుషులకు ఎంతో ప్రయోజనకారి అవుతుంది గదా. అతీంద్రియ శక్తి కావాలని పెంపొందించుకోవచ్చా?

అతీంద్రియ శక్తి కొన్నిసార్లే పని చేయడం, బయట పడడం, మిగితా సమయాల్లో పనిచేయకపోవడం జరుగుతుందా? ఎందుకని? అన్ని సమయాల్లోనూ అతీంద్రియశక్తితో వస్తువులపై ప్రభావం చూపెట్టలేకపోడానికి కారణాలు ఏమిటి? ఇలాంటి సందేహాలు, ప్రశ్నలు తలెత్తాయి. సమాధానం రావలసి వుంది.

ఎన్. ఇన్నయ్య, హైదరాబాద్, ప్రముఖ పాత్రికేయులు

సైకొకినెసిస్ (మనోశక్తితో వస్తువుల కదలిక)

పేరా సైకాలజీలో మనోశక్తితో దూరాన వున్న వస్తువులపై వివిధ విధాల ప్రభావం చూపెట్టడం ఒక ప్రధానాంశంగా ప్రచారంలో వుంది. ఇందులో పెద్ద వస్తువులు, సూక్ష్మ పదార్థాలపై ప్రభావం అని విడదీసి చెబుతున్నారు. పెద్ద వస్తువులపై ప్రభావం అంటే, బల్లను గాలిలోకి లేవనెత్తడం, చెంచాలను వంచడం మొదలైనవి ఉదాహరణలుగా చెప్పారు. సూక్ష్మంగా వస్తువులపై ప్రభావం చూపడం అంటే పావులు ఎగరేసి, నాణాలు విసిరేసి, బొమ్మ బొరుసు కావాలనుకున్న తీరులో వచ్చేటట్లు చేయడమన్నమాట. ఛాన్స్ పద్ధతిలో వచ్చే అంచనాకు విరుద్ధంగా ఎక్కువ సార్లు మనోశక్తి ఎలా కావాలనుకుంటే అలా వస్తుందని ప్రచారం చేశారు.

రోగులను మనోశక్తితో నయం చేయడం కూడా సైకొకెనిసిస్ తన శక్తిగా చూపుతున్నది. వీటన్నిటినీ ఆయా సందర్భాలలో పరీక్షకు గురిచేశారు. యూరిగెల్లర్ చేసిన కొన్ని పనులు, స్పూన్ వంచడం వంటివి జేమ్స్‌రాండి 1982 లోనే చూపాడు. మరికొన్ని శక్తులు, ముఖ్యంగా రోగాలు నయం చేసే అంశాలలో మోసాలు, కప్పి పుచ్చడాలు బయటపడ్డాయి. హెల్మెట్ షిమిట్ వంటి వారి పరిశోధనలలో తీవ్ర లోపాలను సి.ఇ.ఎం. హాన్సల్ (C.E.M. Hansel) చూసి, మూల పద్ధతిలోనే దోషాలు వున్నట్లు వెల్లడించారు. కొందరు పేరా సైకాలజిస్టులు చిత్తశుద్ధితో శాస్త్రీయ పద్ధతిలో ప్రయోగాలు చేసి రుజువులకై తిప్పలు పడుతున్న మాట వాస్తవం. కాని వారికి అడుగడుగునా తీవ్ర ప్రతిబంధాలు ఎదురౌతూనే వున్నాయి.

పళ్ళాలు, చంచాలు యిత్యాది వస్తువుల్ని వంచడం, తుంచడం, వంటివి శక్తులుగా చూపిన ఉదంతంపై పరిశోధన జరిగింది. 160 గంటల పరిశీలనను ఆల్పా ప్రాజెక్టు అన్నారు. సైకిక్ రీసెర్చ్‌కి నిధులు సమకూర్చి సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్శిటీ వారిని పరిశోధించమన్నారు ఈ లాబ్‌ను మక్ లాబ్ (MAC LAB) అంటారు. జేమ్స్ రాండి శిష్యులు యిరువురు కూడా ఆ పరిశోధనలో చేరారు. తరువాత జరిగిన ట్రిక్ అంతా డిస్కవరీ పత్రిక వివరంగా వెల్లడించింది.

పేరా సైకాలజి - పబ్లిసిటి

పేరా సైకాలజి పేరిట జరిగే సంఘటనలు నిజమా, కాదా అనే విచక్షణ గాని, విచారణ గాని లేకుండానే పత్రికలు, రేడియో, టి.వి. లలో ప్రచారం విపరీతంగా వస్తున్నది. ఈ విషయంలో పాఠకులకు, ప్రేక్షకులకు వాస్తవాలు తెలిపే దానికంటే, వ్యాపార సరళి బాగా కనిపిస్తున్నది. అతీంద్రియ శక్తులకు చెందిన అద్భుతాలు ఆసక్తి కలిగిస్తాయి గనుక, జనం ఆత్రుతగా చదువుతారు గనుక, వాటికి చాలా ప్రాధాన్యత లభిస్తున్నది. అద్భుతాలు, మూఢనమ్మకాలు, అతీంద్రియశక్తుల విషయమై సందేహవాదులు, సైంటిస్టులు చేసే హెచ్చరికలు, వాస్తవాలు అంత ప్రాధాన్యతను సంతరించుకోవడం లేదు.

ప్రజలు నమ్మడానికి సిద్ధంగా వున్నారు. నిజా నిజాలతో వారికి నిమిత్తం లేదు. అతీంద్రియ సంఘటన వెనుక వాస్తవాన్ని వివరించడానికి సమయం పడుతుంది. పైగా వివరణ చాలా చిక్కులతో, జటిలంగా వుండవచ్చు. ఒక కథ వలె సాగిపోతున్న ఇంద్రియాతీత శక్తి సంఘటన వలన పత్రికల సర్క్యులేషన్ పెరుగుతుంది. పత్రికలలో అతీంద్రియ శక్తుల వార్తలు వేసినంతగా వాటి వ్యతిరేక వార్తలు, ప్రధానంగా చోటు చేసుకోవు. సంపాదకులు, రిపోర్టర్లు, అతీంద్రియ శక్తుల్ని నమ్మడం, లేదా ఆసక్తి కనబరచడం వలన ప్రసారాలు, ప్రచారంలో అవి ప్రాధాన్యత పొందుతాయి. అలాగే ప్రసార సాధనాల యాజమాన్యం కూడా ఆసక్తి కనబరచి తమ వ్యాపార లాభాలకై ఏ స్థాయికైనా వెడుతున్నారు. ఈ ధోరణి వలన వాస్తవాలు దెబ్బతింటున్నాయి. వార్త నిజం కాదని తెలిసినా అతీంద్రియశక్తుల వార్తకు తాము బాధ్యులం కాదని ప్రచురించరు.

అతీంద్రియ శక్తుల వార్తలు ప్రచురించడంలో, ప్రసారం చేయడంలో కొన్ని నియమాలు పాటించడం అవసరం. అతీంద్రియ శక్తులున్నాయని బాబా, మాత, లేదా మారుమూల వ్యక్తులు చెబుతున్నప్పుడు, మూలాధారాల కోసం రిపోర్టర్లు అన్వేషించాలి. చెప్పుడు మాటల్నిగాక, ఆధారాలే ప్రమాణంగా స్వీకరించాలి. ఇంద్రియాతీత శక్తుల పరిమితులు - శాస్త్రీయ పంథాలు పోల్చి చూచుకోవాలి. లోగడ అలాంటి అతీంద్రియ శక్తుల విషయమై జరిగిన పరిశోధనల్ని దృష్టిలో పెట్టుకొని వార్తలు ప్రచురించాలి. అతీంద్రియ శక్తుల వెనుక వున్న సాధారణ పరిస్థితులు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. విమర్శల్ని పక్కన బెట్టరాదు. అతీంద్రియ శక్తులున్నాయన్నప్పుడు బహిరంగ ప్రదర్శనకై వత్తిడి చేయాలి ఆ సంఘటనను పరిశీలనకు పెట్టాలి. సంఘటనలో కప్పిపుచ్చి, మోసపూరితంగా వ్యవహరించే ధోరణిని అరికట్టాలి. సంఘటనపై చిలవలు పలవలుగా ప్రచురించే కరపత్రాలు, అభిప్రాయాలు ప్రమాణంగా తీసుకోరాదు. ఇలాంటి నియమాలు ప్రసార సాధనాలు, పత్రికలు పాటించగలిగితే, మూఢ నమ్మకాలు జనాన్ని మోసం చేయజాలవు. ఒకానొక అతీంద్రియ సంఘటనకు మీడియా యిస్తున్న విపరీత ప్రాధాన్యత వలన ప్రజలలో ఆసక్తి పెరగడమే గాక, మూఢ నమ్మకాలు ధృవపడుతున్నాయి. దీనికి తగ్గట్లుగా అతీంద్రియ శక్తిని బట్టి బయలు చేస్తూ వచ్చిన నివేదికను, వార్తను చాలా అప్రధానంగా ప్రచురించడం వలన ఎంతో హాని జరుగుతున్నది. ఇలాంటి ధోరణి పత్రికా రంగంలో సర్వసాధారణంగా కనిపిస్తున్నది. బొత్తిగా బాధ్యత లేని అశాస్త్రీయ ధోరణి అటు రిపోర్టర్లలోనూ, యిటు సంపాదకులలోనూ సర్వత్రా కనిపిస్తున్నది. ప్రజలకు శాస్త్రీయంగా నిజాలు చెప్పాలనే ధోరణి రానంత వరకూ అతీంద్రియ శక్తుల పట్ల నమ్మకం సడలదు.

అతీంద్రియ శక్తుల పట్ల సందేహాలు

ప్రాచీన కాలం నుండీ చెదురు మదురుగా ఇంద్రియాతీత శక్తుల పట్ల సందేహాలు, ఖండన మండనలు వ్యక్తమౌతూనే వున్నాయి. గ్రీస్ - రోమన్ ప్రాంతాలలో సందేహ వాద పితామహుడుగా ఇలీస్‌కు చెందిన పైరొ (Pyrrho)ను చెప్పవచ్చు - 360 - 270 క్రీ.పూ. ఆ తరువాత అకడమిక్ సందేహవాదం ప్లేటో అకాడమీ నుండి పుట్టింది. ఆర్సిలాస్ (Arcesilaws), కార్నిడస్ (Carneades) యీ రంగంలో పేర్కొనదగినవారు. ఆధునిక యుగాలలో పైర్‌బేల్ (1647 - 1706), రేనడెక్కార్ట్(1596 -1650), డేవిడ్ హ్యూం (1711 - 1776) సందేహవాదానికి పునాదులు గట్టిగా వేశారు. ఫ్రెంచి అకాడమీ ప్రత్యేక విచారణలు జరిపి ఫ్రాంజ్ మెస్మర్(1734 - 1815) యానిమల్ మాగ్నటిజపు బూటకాలను బట్టి బయలు చేసింది. 19వ శతాబ్దం చివరలో 20వ శతాబ్దం ప్రారంభంలో అనేక అతీంద్రియ శక్తుల గురించి పరిశోధనలు జరిగాయి. ఏదీ శాస్త్రీయ పరిశీలనకు రుజువు కాలేదు. జె.బి. రైన్ వచ్చి అతీంద్రియ శక్తులకు శాస్త్ర గౌరవం కోసం అనేక పరీక్షలు జరిపాడు. సైకాలజిస్టు బి.ఎఫ్. స్కిన్నర్ యీ రంగంలో రైన్ వృధా ప్రయాసను తీవ్రంగా ఎదుర్కొన్నాడు. సైకొ కెనిసిస్ పై శాస్త్రీయ విమర్శలను ఎడ్వర్డ్ గిర్డెన్ (Edward Girden) ప్రచురించాడు.

1976లో అమెరికాలో అతీంద్రియ శక్తుల శాస్త్రీయ పరిశీలనకు ఒక నిపుణుల సంఘం ఏర్పడింది. దీనిని సికాప్ (CSICOP) అని పొడిగా పిలుస్తారు. పాల్ కర్జ్ సంఘాధ్యక్షుడుగా ఇందులో అనేకులు పని చేశారు. సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు కార్ల్ శాగన్, తాత్వికులు సిడ్నీ హుక్, ఎర్నెస్ట్ నాగెల్, మార్టిన్ గార్డ్నర్, మాంత్రికుడు జేమ్స్ రాండి, డబ్లు. వి. క్విన్, ఫిలిప్ క్లాజ్, మార్సిలో ట్రూజి, రేహైమన్ ప్రభృతులు బాగా లోతు పాతులు అధ్యయనం చేశారు.

సైకోకెనిసిస్ రంగంలో ప్రపంచ ప్రసిద్ధుడుగా ఆవిర్భవించిన యూరిగెల్లర్ స్పూన్ (చెంచాలు) వంచడం వంటి ఇంద్రియాతీతశక్తి వెనుక వున్న కిటుకులను బయట పెట్టి యీ సంఘం శాస్త్రీయంగా ముందుకు సాగింది. సంఘ పక్షాన స్కెప్టికల్ ఇంక్వైరర్ అనే పత్రిక పెట్టి, ఎప్పటికప్పుడు అతీంద్రియ శక్తుల శాస్త్రీయ పరిశీలనా ఫలితాలు వెలికి తెస్తున్నారు. కెంద్రిక్ ఫ్రేజర్ సంపాదకత్వాన యీ పత్రిక కొనసాగుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ ఇంద్రియాతీత శక్తి సంఘటన దృష్టికి వచ్చినా యీ సంఘంవారు పరిశీలిస్తున్నారు. ఎక్కడా రుజువుకు నిలబడిన సంఘటన కనిపించలేదు. Committee for the Scientific Investigation of Claims of the Paranormal (CSICOP) సంఘాన్ని చైనాకు ఆహ్వానించి, అక్కడ జరుగుతున్న అతీంద్రియ శక్తుల వుదంతాలను పరిశీలించమన్నారు. పాల్ కర్జ్ ఆధ్వర్యాన 1988 లో ఆరుగురితో కూడిన సంఘం చైనాలోని కొందరు అతీంద్రియ శక్తి పరుల్ని పరిశీలించింది. సైకిక్ శక్తులున్నాయన్న పిల్లల్ని కూడా టెస్ట్‌కు గురి చేశారు. మోసాలు జరగకుండా జాగ్రత్తలు చేసే సరికి, పిల్లల్లో ఎలాంటి ఇంద్రియాతీత శక్తులు లేవని తేలింది. చైనాలో బాగా ప్రచారంలో వున్న కిగాంగ్ (Qigong) శక్తిలో ''శక్తి'' ఏదీ లేదని రుజువు పరచారు.

ప్రతి సంవత్సరం యీ సంఘం వారు సమావేశాలు జరిపి అత్యంత అధునాతనంగా ప్రపంచంలో ఎక్కడ ఏం జరుగుతున్నదీ వివరిస్తూ అతీంద్రియశక్తుల అధ్యయనం చేస్తున్నారు. ఈ విషయాలపై టేపులు సిద్ధం చేసి యిస్తున్నారు. యూరిగెల్లర్ యీ సంఘంపై కోర్టులో కేసులు పెట్టి ఓడిపోయి, ప్రస్తుతం అమెరికాలో అడుగు పెట్టకుండా ఇంగ్లండ్‌కు పరిమితమయ్యాడు. కోర్టులో తన చెంచాలు వంచే శక్తి నిజమని రుజువు చేసుకోలేక పోయాడు.

అతీంద్రియ శక్తులున్న వారిని అమెరికా, యూరోప్‌లలో పోలీస్ శాఖ సైకిక్ డిటెక్టివ్‌లుగా వాడుకుంటున్నది. నేరస్తులను పట్టివ్వడానికి, నేరాలలో కీలకాలు బయటపెట్టడానికి సైకిక్ డిటెక్టివ్‌లు ఉపకరిస్తారని పోలీస్ నమ్మింది. కాని రుజువుకు పెడితే ఎక్కడా సైకిక్ డిటెక్టివ్‌లు నిలబడలేదు. ఉజ్జాయింపుగా వూహించి చెప్పడం, అదృష్టవశాత్తు నిజమైతే తమ శక్తిగానూ, లేకుంటే నోరు మూసుకొని మరోచోటికి పోవడం జరుగుతున్నది. కంట్రోల్డ్ పరిశోధనలకు కొందరు సైకిక్ డిటెక్టివ్‌లను గురిచేసి, నివేదికలు వెల్లడిస్తే వారికి ఎలాంటి ఇంద్రియాతీత శక్తులు లేవని తేలింది. పాశ్చాత్య దేశాలలో వున్న యీ సైకిక్ డిటెక్టివ్ సంప్రదాయం భారత దేశంలో సోకలేదు. ఇది బాబాలకు, మాతలకు పరిమితమైన శక్తిగానే మిగిలింది. అయితే బాబాలను శాస్త్రీయ పరిశోధనకు గురి చేయనందున వారి వ్యాపారం నిరాఘాటంగా సాగిపోతున్నది.

భారతీయ బాబా మహేష్‌యోగి అమెరికా వెళ్ళి గాలిలో తేలే విద్య నేర్పిస్తానని కొంతకాలం ధనార్జన చేశాడు. ఎంతకూ ఆ శక్తి బయట పడకపోయే సరికి ఆయన శిష్యులే కోర్టుకెక్కారు. ఫిలడెల్ఫియా కోర్టు మహేష్‌యోగిపై తీర్పు యిస్తూ ఆయన్ను డబ్బు చెల్లించమన్నది. కోర్టు బయట వ్యవహారం పరిష్కరించుకున్న మహేష్ యోగి యిప్పుడు అమెరికా వెళ్ళడం లేదు.

మనదేశంలో ఏ బాబాను శాస్త్రీయ పరిశోధనకు గురిచేసినా వారి నిజానిజాలు తెలుస్తాయి. హెచ్. నరసింహయ్య కమిటి అలాంటి పరిశోధన చేయబోగా సాయిబాబా తప్పించుకున్నాడేగాని, నిలబడలేదు. బాబాలకు పోలీస్, ప్రభుత్వం అండగా నిలిచినంతకాలం వారి అతీంద్రియ శక్తులు భక్తుల్ని వశపరుచుకుంటూనే వుంటాయి. ఇన్నాళ్ళుగా విభూతితో, ఇతర ఇంద్రియాతీత శక్తులున్నాయనే భ్రమ కల్పించిన సాయిబాబా సైతం, తనకు అలాంటి మహిమలు, శక్తులు లేవని ఒప్పుకున్నట్లే అయింది. అందుకు నిదర్శనం రోగుల్ని నయం చేయడానికి పుట్టపర్తిలో సాయిబాబా

సూపర్ స్పెషల్ ఆస్పత్రి పెట్టడమే తార్కాణం. మహిమలతో రోగాలు తగ్గించగలిగితే ఆస్పత్రిలో శాస్త్రీయంగా చికిత్స దేనికి అనే అంశం భక్తులకు తెలియడానికి కొంతకాలం పడుతుంది. ఇది అందరు బాబాలకు, స్వాములకు, మాతలకు అన్వయించి చూచుకోవాలి.

కార్ల్‌యూంగ్

అతీంద్రియ శక్తుల గురించి సిగ్మండ్ ఫ్రాయిడ్, కార్ల్ యూంగ్‌లు తీవ్రంగా వాదించుకున్నారు. ఫ్రాయిడ్ నాస్తికుడు మూఢ నమ్మకాలకు వ్యతిరేకి. యూంగ్ నమ్మకాల పుట్ట, అతడి ప్రభావం వలన కూడా అతీంద్రియ శక్తుల ప్రచారం బాగా సాగింది. కార్ల్ గస్టావ్ యూంగ్ (1875-1961) సింక్రోనిసిటి, ఆర్కిటైప్ అనే రెండు సిద్ధాంతాలు ప్రచారంలో పెట్టి, మూఢ నమ్మకాలకు ప్రాతిపదికలు సమకూర్చాడు. యూంగ్ జ్యోతిష్యాన్ని, టెలిపతిని, గాలిలో తేలడాన్ని, వస్తువుల్ని సృష్టించడాన్ని నమ్మాడు. అతీంద్రియ శక్తుల విషయంలో యూంగ్ ఒకవైపు అతి జాగ్రత్త వహిస్తున్నట్లు అగుపించినా, వాటికి ఆధునిక శాస్త్రీయ ప్రతిపత్తి కల్పించాలని తహతహలాడాడు. జె.బి. రైన్ పరిశోధనలు తన సిద్ధాంతాలకు మద్దతుగా చూపాడు. తీరా, జె.బి. రైన్ పరిశోధనలే శాస్త్రీయ పరిధికి నిలవకుండా పోయాయి. బయట ప్రపంచంలో జరిగే సంఘటనలే వ్యక్తికి అనుభూతులుగా ప్రతి బింబిస్తాయని యూంగ్ తన Synchronicity సిద్ధాంతంలో నమ్మాడు. అదే సిద్ధాంతం ప్రకారం, సమష్టి అవ్యక్తత (Collective Unconscious) లోని అంశాలు వ్యక్తిలో ప్రతిబింబిస్తాయన్నాడు యూంగ్. యూంగ్ ఆర్కిటైప్ వాదం జ్యోతిష్యం చెప్పే రాసులవంటివి, వాటికి ఉనికి లేదు. అవి కేవలం నమ్మకం పై ఆధారపడినవే. పురాణగాథల్లోని అంశాలకు బాహ్యరూపాన్ని, వాస్తవికతను కల్పించే ప్రయత్నం కూడా యూంగ్ చేశాడు. ఆర్కిటైప్ అంశాలు వంశ పారంపర్యతగా సంక్రమిస్తాయని కూడా యూంగ్ నమ్మాడు. క్వాంటం సిద్ధాంతంలో విషయాల్ని యూంగ్ తన సామ్యాలకి వాడుకోబోయి పొరబడ్డాడు. క్వాంటం సిద్ధాంత ప్రతిపాదనలు రుజువుకు నిలిచాయి. యూంగ్ చెప్పేవాటికి రుజువు గాక, నమ్మకమే ప్రధానం. అయినా యూంగ్, ఆర్థర్ కోస్లర్ వంటి వారి ఆసక్తి కారణంగా అతీంద్రియ శక్తుల పట్ల నమ్మకం పెరిగింది. వ్యక్తిగతంగా వుండే అవ్యక్తత, సమష్టి అవ్యక్తత అనేవి మానవ సంపదగా చూపిన యూంగ్, క్రమానుగతంగా, లామార్క్ జీవ సిద్ధాంతం వలె, సంక్రమిస్తాయని అతడి నమ్మకం. వీటికి ఆర్కిటైప్ అని నామకరణం చేశాడు. భావాలకు యివే మూలం అన్నాడు.

టెలిపతి పట్ల ఉదార దృష్టి అవలంబించమని యూంగ్ కోరాడు. అతీంద్రియ శక్తులను సమర్థించడానికి యూంగ్, ఒక సైంటిస్ట్ పాలి (Pauli)తో కలసి Interpretation of Nature and Psyche అనే పుస్తకం రాశాడు. పదార్థానికి చెందిన సూక్ష్మ రూపంలో సైకి విధానాన్ని నిర్మించవచ్చని అన్నాడు. సైన్సులో రుజువుకు నిలవకుంటే తోసిపుచ్చుతారు. యూంగ్ ఒకవైపున సైన్స్ ఉదాహరణలు తెచ్చి, తాను చెప్పే సైకిని రుజువుకు పెట్టడానికి, రుజువు కాకుంటే నిరాకరించడానికి సిద్ధపడలేదు. అదే నమ్మకస్తుల బలం! అతీంద్రియ శక్తుల విషయంలో అత్యంత ఉత్సాహం చూపిన ఆర్థర్ కోస్లర్ చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు.

నేడు పేరా సైకాలజీ కొన్ని యూనివర్శిటీలలో కోర్సులుగా వున్నది. అక్కడ మాత్రం దీనికి ఎలాగైనా శాస్త్రీయ గౌరవాన్ని తీసుక రావాలని కృషి చేస్తున్నారు. ఆధునిక విజ్ఞాన సాంకేతిక పరికరాల సహాయంతో వివిధ పరిశీలనలు జరుపుతున్నారు. ఇంత వరకూ నిర్ధారణగా ఒక్క పేరా సైకాలజీ పరిశోధనకూ శాస్త్రీయ ప్రమాణం రాలేదు. పేరా సైకాలజీని సైన్సులో భాగంగా పరిగణించడానికి అవకాశం లభించడంలేదు, ఇదీ వాస్తవ పరిస్థితి. సైన్స్ పేరిట, శాస్త్రీయ పరిశోధనల పేరిట మోసాలు చేసి తాత్కాలికంగా నమ్మించడం పేరా సైకాలజీలో పరిపాటి అయింది. శాస్త్రీయ పరిశోధనలంటూ

కొన్ని పత్రికలలో వివరాలు ప్రచురించడం, తీరా వాటిని మళ్ళీ పరీక్షకు పెడితే ఫలితాలు రాకపోవడం సర్వసాధారణమై పోయింది.

ఇంత జరుగుతున్నా, సైన్స్ నేటికీ విశాల దృక్పథంతో, సహనంతో వుంది. పేరా సైకాలజీ ఎప్పుడు ఎక్కడ రుజువు పరచినా ఆమోదించడానికి సైన్స్ సిద్ధపడుతోంది. ఏమైనా సరే, పేరా సైకాలజీ కూడా సైంటిఫిక్ అని రుజువు చేయాలని ఆత్రుత పడడంలోనే, సైంటిఫిక్ మెథడ్‌లోని గొప్పదనం అర్థం చేసుకోవచ్చు.

సైన్స్, సంపూర్ణతను, అంతా కనుగొన్నాం అనడాన్ని సూతరమూ ఒప్పుకోదు. సైన్స్ ప్రకారం తెలుసుకోవడం, మార్చుకోవడం, దిద్దుకోవడం నిరంతరం జరిగే పని. పవిత్ర గ్రంథాల పేరిట అంతా అందులోనే వున్నదని సైన్స్ ఏనాటికీ అనదు. అందువలన సైన్స్ మానవాళికి తోడ్పడుతుంది.

పేరా సైకాలజి మానవ అభివృద్ధికి దోహదం చేసిన ఉదాహరణ ఒక్కటి లేదు.

ఆసక్తి గలవారికి పరిశీలనార్థ రచనల :

1. James Alcock, *Parapsychology: Science or Magic ?* (London, Oxford 1985)
2. J.B. Rhine, *Extrasensor Perception* (Boston, Brug Humphries 1934)
3. Terry White, *The Sceptical Occultist* (London; Arrow 1988)
4. Terence Hines, *Psendoscience And The Paranormal* (New York: Promethens Books 1988)
5. Richard Milton, *Forbidden Science: Exposing The Secrets Of Suppressed Research* (London: Fourth Estate 1994).
6. Hans Eysenck and Carl Sargent, *Explaining the Unexplaind* (London: Weidenfeld & Nicolson 1982)
7. John and Anve Spencer, *The Encyclopaedia of The World's Greatest Unsolved Mysteries* (London, Headline 1995)
8. Carl Jung and Wolfgang pauli, *The Interpretation of Nature and The Psyche* (New York, Pantheon 1955)
9. Asimor, Isaac, *The Roving Mind.* (Promethdns books, Amherst, New York 1983)
10. Frazier, Kendrick, ed. *Science Confronts the Paranormal,* (Amherst N.Y. USA Promethans Books 1986)
11. Hines, Terence, *Pseudoxience and the Paranormal A Critical Examination of the Evidence 1988* (Promethans Books N.Y)
12. Kurtz, Paul, *The Tranxendental Temptation A Critique of Religion and The Paranormal* 1986 (Promethans Books).
13. Randi, James; *Flim Psychies, ESP, Unicorns and other Delusions* 1989 Promethans Books.
14. Krippner, Stanley, ed. *Advances in Parapsychological Research* Vol. 1-7, (New York, Plenum Press 1977, 1978, 1982).
15. Wolman, Benjamin. B. ed. *Handbook of Parapsychology* (Van Nostrand Reinhold 1977)
16. Beloff, John, *Parapsychology: A Concise History,* 1993 (Athlone, London).

(సమాప్తం)

శతాబ్దంతో పాటు తీరు మారిన పరిశోధన

- నాగసూరి వేణుగోపాల్

మార్కెట్‌తో నెట్టబడే ఆర్థిక వ్యవస్థ (Market driven economy) అనే మాట వింటూంటాం. ఇది కేవలం ఎకానమీకే కాదు, రాజకీయాలకు, వాణిజ్యానికి వర్తిస్తుంది. అంతేకాదు విద్యారంగానికి, పరిశోధనకు ఆ పోకడలు వచ్చాయి. ఈ ధోరణిని అర్థం చేసుకోవాలంటే ఒక ఉదాహరణ చెబుతాను. ''ఇపుడు ఐజాక్ న్యూటన్ వచ్చినా, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వచ్చినా - ఉద్యోగం లభించకపోవచ్చు'' అని ఒక సామాజిక శాస్త్రవేత్త యిటీవల ఒక టీవీ యింటర్వ్యూలో అన్నాడు. ఈ వ్యాఖ్య వింతగా అనిపించినా - అవాస్తవం మాత్రం కాదు. ఎందుకంటే తక్షణం ఫలితం లేనిది ఏదీ నేడు గౌరవించబడదు, ఆహ్వానించబడదు. ఇటువంటి శాస్త్రవేత్తలు రూపొందించిన సిద్ధాంతాలు కూడా హడావిడిగా మార్కెట్లో లాభాలు పొందలేవు. ఎందుకంటే వారు ఏదో లబ్ధి నాశించి పరిశోధన ప్రారంభించలేదు, లేదా కొనసాగించలేదు. ఈ పరిశోధనలకు అనువర్తనలు అటు తర్వాత వాడే శాస్త్రవేత్తల సృజనాత్మకత మీద ఆధారపడి వుంటాయి. అయితే అన్నింటికీ ఫలితాలు గ్యారంటీగా వుండకపోవచ్చు. మరి అటువంటి సందర్భంలో న్యూటన్‌ను అయినా గుర్తించరు, ఐన్‌స్టీన్‌ను అయినా గౌరవించరు. ఇది ప్రపంచీకరణ మహిమ! ప్రతీదీ వ్యాపారీకరణ కావడమనే దాని ప్రభావం. మారిన పరిశోధనా రంగపు ధోరణికి ఇది ఒక పార్శ్వం మాత్రమే!

గత శతాబ్దం కొసన కనబడిన పరిణామాలు క్రమంగా బలపడి ఇరవయ్యొకటో శతాబ్దాన్ని కూడా అదేరీతిలో ప్రభావితం చేయవచ్చు. ఇంతకు ముందు ఎవరి దారి వారిది అనేలా వుండేది. ఇపుడు ప్రతి శాస్త్ర విభాగం మరో శాస్త్ర విభాగంతో ఎంతో కొంత సంబంధం కల్గివుంది. గణిత శాస్త్రవిభాగపు ప్రాధాన్యత ఎంత ఎక్కువో క్రమంగా అవగతమవుతోంది. కంప్యూటర్ రాకతో పరిశోధనలో యిది మరో ముఖ్య అంశమైంది. ఇదివరకులా ఒకే శాస్త్రవిభాగం అని కాకుండా, పలు శాస్త్ర విభాగాలతో కూడిన సమగ్ర దృష్టి యిపుడు రూపొందింది. అలాగే సంక్లిష్ట అంశాలను అధ్యయనం చేయడం కూడా పెరిగింది. ఇక ప్రపంచీకరణ ప్రభావం సరేసరి! ఈ ఐదు అంశాల సాయంతో రూపు మారిన ఇరవయ్యొకటో శతాబ్ది పరిశోధనను కొంత వరకు వివరించవచ్చు లేదా అవగతం చేసుకోవచ్చు.

ఫలాపేక్ష లేకుండా పని చేయడం గురించి గీతాకారుడు చెబుతాడు. అటువంటి రీతిలో ఎటువంటి అనువర్తనలు ఆశించకుండా సాగించేది పరిశోధన అని యింతవరకు భావించబడేది. అంతనిష్కామ కర్మగా చేయబడిన పరిశోధన నుంచి భవిష్యత్తులో ఏమైన ఫలితాలు పుట్టుకరావచ్చు. అంతే కానీ యిపుడు గ్యారంటి లేదు. ఇది ఒక రకం, కాగా ప్రజల అవసరాలకు తగిన వాటికోసం అన్వేషణ సాగించడం మరో రకం.

నాగసూరి వేణుగోపాల్, విజయవాడ, ఆకాశవాణి ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు.

అయితే క్రమంగా ఈ ధోరణి మారి 'మొదట టెక్నాలజి' అనే వ్యూహంవైపు పలుదేశాలు జరగడం కనబడుతోంది. అంటే ఎక్కడో జరిగిన పరిశోధన తీసుకుని టేక్నాలజి తయారు చేసుకోవడం అన్నమాట. ఇది మొదట బాగా పని చేసినా యిపుడు అంతగా సాధ్యం కావడం లేదు. ఎందుకంటే పరిశోధనకూ, దాని అనువర్తనానికి మధ్య పెద్దగా అంతరం వుండటం లేదు. ఫలితంగా మరోదేశం దాన్ని తెలుసుకొని, టెక్నాలజి రూపొందించుకునేలోపు ఆదేశమే టెక్నాలజిని తయారు చేసుకోవచ్చు.

ఇపుడు జపాన్‌తో పాటు ప్రపంచంలోని యితర దేశాలు కూడా తమ అన్వేషణలు తామే కొనసాగించడమే, కాకుండా యితర దేశాలలో సాగిన పరిశోధనలను కొనసాగించి ఫలితాలకోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇంతవరకు సాగించిన పద్ధతి కాకుండా యిలా చేయడం వ్యయంతో ముడిపడిన విషయమే కావచ్చు, అయితే యిందులో విజయం తప్పనిసరిగా వుంటుంది. అందువల్ల యిపుడు చాలా దేశాలు ఈ రీతిలో కొనసాగుతున్నాయి. అలాగే ఎపుడో ఫలితాలనిచ్చే పరిశోధనలు కాకుండా తక్షణం ఫలితాలనిచ్చే పద్ధతిలోకి మారిపోతున్నాయి. ఇది వాణిజ్య అవసరాలు లేదా దేశ రక్షణ అవసరాలు. అది అంతరిక్షం సంబంధించి కావచ్చు, అణు పరీక్షల విషయం కావచ్చు. ఇది వరకులా ఎక్కువ వ్యయంతో నడిచే పరిశోధనా ప్రయోగశాలలు నేడు తగ్గిపోయాయి. చిన్న చిన్న పరిశ్రమలనుబంధ పరిశోధనా శాలలు వెలిశాయి. ఇపుడు ప్రభుత్వమో, పరిశ్రమలో పరిశోధనా విభాగాలు ఏర్పరచవలసిన సమయం ఆసన్నమైంది. అలాగే పరిశోధన, అనువర్తనం రెండు ఒకే దగ్గర వుండటం మరో పరిణామం.

ఇంతవరకు సైన్స్ అంటే సైద్ధాంతికం, ప్రాయోగికం అని విభజించి చూసేవాళ్ళం. కానీ నేడు కంప్యూటర్ రాకతో మరో ప్రధాన అంగం వచ్చి చేరింది. ఇపుడు చాలా సంక్లిష్టమైన అంశాలను కూడా యిట్టే క్షణాల మీద, ఖచ్చితంగా విశ్లేషించగలం. దీనితో సైద్ధాంతిక కంప్యూటర్ విజ్ఞానం అనే కొత్త శాఖ తయారైంది. ఇది కేవలం గత పాతిక సంవత్సరాలలో పరిఢవిల్లిన విభాగం. ఫలితంగా యితర విభాగాలతో అనుసంధానం జరగడంతోపాటు, యువ శాస్త్రవేత్తలను పరిశోధనవైపు ఆకర్షించడం సాధ్యమైంది. అంతేకాదు యిందులో కూడా సామర్థ్యం ప్రధాన పాత్ర వహిస్తోంది.

కంప్యూటర్ రాకతో సంభవించిన పరిణామం రెండవది కాగా, ఒక శాఖ కాకుండా పలుశాఖలు అనేది ఈ శతాబ్దపు గురుతు. ఇది వరకు ఒక శాఖలో పరిశోధించడం, ఆ పరిశోధనను అదే విభాగపు మరో పరిశోధకుడు ఆమోదించడం, అదే శాఖకు చెందిన జర్నల్సులో ప్రచురణలు రావడం, తర్వాత ఏదైన అకడమిక్ వారికి ఎంపిక కావడం ఆనవాయితి. ఈ పద్ధతిలో అమోఘమైన ఫలితాలు వచ్చాయి కూడా. పదార్థపు మూలాలను భౌతికశాస్త్రం వివరించగలిగితే. రసాయనశాస్త్రం అవసరమైన ధర్మాలు గల పదార్థాలు తయారు చేయగలిగే సామర్థ్యం పొందాయి. జీవాన్ని నియంత్రించే జన్యువులు, ప్రొటీన్లను గుర్తించగలిగారు జీవ శాస్త్రజ్ఞులు. అయితే యిపుడు ముందుకు వస్తున్న సమస్యలను కేవలం ఒక శాఖ వివరించలేని పరిస్థితి వుంది. దాంతో 'ఇంటర్ డిసిప్లినరి' దృష్టి మొదలైంది. ఫలితంగా కొత్త విజ్ఞానం,

కొత్త టెక్నాలజి సాధ్యపడింది. మరీ ముఖ్యంగా జీవక్రియలను అవగతం చేసుకోవడంతో, రోగకారణాలు విశ్లేషించడంలో యిది ఎంతగానో దోహదపడింది. దాంతో పలు శాస్త్ర శాఖలు గల 'కన్సోర్టియమ్స్' ప్రారంభమయ్యాయి.

ఇంతవరకు ప్రతిపాదింపబడిన సూత్రాలు నిర్దుష్టంగా, క్రమబద్ధంగా వున్నాయి. కానీ ప్రపంచం అలాలేదు. అంటే మన సూత్రాలకు దొరకని సంక్లిష్టత వుందని బోధపడుతోంది. ఇటువంటి వాటిని జీవశాస్త్రాలలో చాలా చూపవచ్చు. ప్రపంచం సంక్లిష్టం కావడంతో సంక్లిష్ట నమూనాలకు గిరాకి పెరిగింది. ఈ సంక్లిష్ట నమూనాలు పెద్దవి మాత్రమే కాక, మౌలికంగా విభిన్నమైనవి కూడా అని అర్థమైంది. ఫలితంగా యిదివరకు క్రమబద్ధమైన వ్యవస్థలను అధ్యయనం చేయడానికి వాడిన పరికరాలు యిక్కడ ఉపయోగపడవు. ఉదాహరణకు వాతావరణం విషయం తీసుకోండి. ఇది ఎంతో సంక్లిష్టమైంది. ఇది ఎంత తీవ్రంగా వుందంటే వాతావరణం కేవలం వారంలోపు పని చేస్తుంది కానీ అంతకుమించి కాదు. అందువల్ల యిందులో మరింత పరిశోధనకు ఎంతో అవకాశం వుంది. దానికి తగిన పరికరాలు, ప్రయోగశాలలు అవసరం కావచ్చు.

ఇక చివరి అంశం - ప్రపంచీకరణ. పరిశోధనను ప్రపంచీకరణ ఎలా ప్రభావితం చేయగలదు? ఇపుడు మరింత నాణ్యమైనది, శీఘ్రంగా, చౌకగా కావాలి. అంతేకాదు పలుచోట్ల పరిశోధనలు జరగడం, అనుసంధించడం జరుగుతుంది. దాంతో పలు దేశాలు, పలు సంస్థలు అనుసంధింప బడ్డాయి. ధనిక, వర్ధమాన అన్న తేడా లేకుండా ఈ సమన్వయం జరుగుతోంది. అంతర్జాతీయ స్థాయిలో భాగస్వాములు తయారు కావడంతో ప్రపంచ పరిశోధనా సమన్వయ సంస్థలు వస్తున్నాయి. ఇది కేవలం కొన్ని దేశాలకే కాక, అన్ని దేశాల శాస్త్రవేత్తలకు తోడ్పడవచ్చు. ఇతర దేశాల శాస్త్రవేత్తలు ప్రతిభావంతులేకాక, విభిన్నమైన దృక్పథం గలవారు అయి వుండవచ్చు. ఇందులో కొన్ని ప్రతిబంధకాలున్నా మరింత అదానప్రదానాలు దేశాల మధ్య, శాస్త్ర శాఖల మధ్య సాధ్యమయ్యే అవకాశముంది.

ఈ నేపథ్యంలో ప్రస్తుతం వుండే విశ్వవిద్యాలయ వ్యవస్థలు రేపు తగినవిగా కనబడకపోవచ్చు. విభిన్న శాఖలు విడిగా వుండటం యిక సాధ్యపడక పోవచ్చు. ఇపుడు పరిశోధనా అంశం, పరిశోధనా దృష్టి, పరిశోధనా పద్ధతి, పరిశోధనా లక్ష్యం మారింది కనుక కొత్తగా పరిశీలించక తప్పదు. ఇరవయ్యొకటో శతాబ్ది పరిశోధనా పద్ధతిని స్థూలంగా యిలా చెప్పుకోవచ్చు.

> Buddhism and psychoanalysis teach us that the very ways in which we seek happiness actually block us from finding it. Our first mistake is in trying to wipe out all the sources of displeasure in our lives.
>
> ***By Mark Epstein, M.D.***

జేమ్స్ జాయిస్ ''డబ్లినర్స్'' - ఒక పరిశీలన

- నవీన్

(గత సంచిక తరువాయి)

చాండ్లర్‌కు బార్ నుండి ఇంటికొచ్చాక తానెంత పేదరికంలో జీవిస్తున్నాడో అర్థమౌతుంది. అతనికి అతని భార్య 'అన్నీ' మీద కూడా కోపమొస్తుంది. తన పేదరికానికి ఆమె కారణమనుకుంటాడు. బైరన్ కవి రచించిన కవితల్ని చదివి ఊరట పొందాలని ప్రయత్నిస్తాడు. అతని ఆలోచనలకి భగ్నం కల్గిస్తూ వాళ్ళ పాప నిద్రలోంచి లేచి బిగ్గరగా యేడుస్తుంది. చాండ్లర్‌కు పాపమీద బాగా కోపమొస్తుంది. ''యేడుపు ఆపు!'' అంటూ బిగ్గరగా అరుస్తాడు. దాంతో ఆ పాప యింకా బిగ్గరగా యేడుస్తుంది. అలా గుక్క పట్టి యేడుస్తున్న పాప చనిపోతుందేమోనని, ఒకవేళ పాప చనిపోతే అందుకు తనే బాధ్యుడౌతాడని చాండ్లర్ వణికి పోతాడు. అతని భార్య 'అన్నీ' లేచి వచ్చి పాపను ఊరడిస్తుంది. తను చాలా పాశవికంగా ప్రవర్తించానని చాండ్లర్ అనుకొని పశ్చాత్తాప పడటంతో 'లిటిల్ క్లౌడ్' కథ అయిపోతుంది. గొప్పకథ.

'కౌంటర్ పార్ట్స్' కథలో ఓ ప్రైవేట్ ఆఫీసులో క్లర్కుగా పని చేసే 'ఫారింగ్‌టన్'కు, అతని యజమాని 'అలెయానె'కు మధ్య యేర్పడే సంఘర్షణ చిత్రించబడింది.

ఫారింగ్‌టన్ వేగంగా పని చెయ్యలేడు. సోమరిపోతు, ఈ కారణం వల్ల వాళ్ళ బాస్‌తో చీవాట్లు తింటుంటాడు. అలా ఒక రోజు వాళ్ళ యజమానితో బాగా తిట్లుతిని ఇంటికొచ్చిన ఫారింగ్‌టన్ తన కోపాన్ని తన చిన్న కొడుకు మీద చూపిస్తాడు. ఆ పసివాన్ని కసిదీరా కొట్టి చాలా తృప్తి పడ్తాడు. 'కౌంటర్ పార్ట్స్'ని కూడా జాయిస్ రచించిన గొప్ప కథల్లో ఒకటని చెప్పొచ్చు.

'క్లే' కథలోని తల్లి 'మరియా'ను జాయిస్ ఐర్లాండ్ దేశానికి సంకేతంగా సృష్టించాడని విమర్శకులు చెప్పారు.

'మరియా' ఒక లాండ్రీ షాపులో పనిచేస్తుంటుంది. ఎంతో సాత్వికురాలైన ఆమెను, ఆమె చుట్టు పక్కలున్న వాళ్ళందరూ ప్రేమిస్తారు. ఒకరోజు 'మరియా' తన కొడుకు 'జొ' యింటికొస్తూ దార్లో ట్రామ్ దిగి తన మనవళ్ళ కోసం ఓ రొట్టె (కేక్) కొంటుంది. మళ్ళీ ట్రామ్ ఎక్కి 'జొ' యింటి ముందు దిగేటప్పుడు ఆ రొట్టెను ట్రామ్ లోనే మరచిపోయి వట్టి చేతులతో కొడుకు యింటికెళ్ళి తన మనవళ్ళకు యేమీ యివ్వలేకపోయానే అని బాధపడ్తుంది. ఈ కథలో ''మరియా''ను ఐర్లాండ్ దేశంగానూ, ఆమె పోగొట్టుకున్న రొట్టెను ఐర్లాండ్ పోగొట్టుకున్న స్వాతంత్ర్యంగానూ జాయిస్ సంకేతించాడు. (ఐర్లాండ్ దేశం మొన్న మొన్నటి వరకు ఇంగ్లాండ్‌కు వలస రాజ్యంగానే ఉండిపోయింది)

'ఎ పెయిన్‌ఫుల్ కేస్' కథలో ఓ వ్యక్తిలో ఉండే అహంకారాన్ని, ప్రేమరాహిత్యాన్ని జాయిస్ చిత్రించాడు. ఈ కథలోని 'డఫీ' ఎవర్నీ ప్రేమించలేడు. అతనిలో అహంకారం చాలా ఎక్కువగా ఉంటుంది. 'సినికో' అనే యువతి ఇతన్ని ప్రేమిస్తుంది. కానీ ఆమె అతని ప్రేమను పొందలేక ఆత్మహత్య

నవీన్, వరంగల్, అంపశయ్య నవలా రచయితగా ప్రసిద్ధుడు

చేసుకొని చనిపోతుంది. ఈ కథలో ఒక వ్యక్తిలోని ''ప్రేమరాహిత్యా''న్ని మరోవ్యక్తిలోని ''ప్రేమబంధాన్ని'' రచయిత గొప్పగా చిత్రించాడు. ఈ కథలోని 'డఫీ' పాత్రకు జాయిస్ తమ్ముడైన 'స్టానిస్ లాస్ జాయిస్సే' ఆధారమని జాయిస్ విమర్శకులు చెబుతారు.

''ఐవీడే ఇన్ ది కమిటీ రూమ్'' అన్న కథ జాయిస్ ప్రజా జీవనాన్ని (Public Life) చిత్రిస్తూ రాసిన మూడు కథల్లో మొదటిది. ఈ కథలో జాయిస్ ఆ రోజుల్లో డబ్లిన్ నగర మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్ని చిత్రించాడు. ఈ మున్సిపల్ ఎన్నికలు అక్టోబర్ ఆరో తేదీనాడు జరిగాయి. ఐర్లాండ్ చరిత్రలో అక్టోబర్ ఆరో తేదీకొక ప్రత్యేకతుంది. ఆరోజు ఐర్లాండ్ దేశస్వాతంత్ర్యం కోసం ఇంగ్లాండుతో పోరాడిన 'పార్నెల్' అన్న గొప్ప దేశభక్తుడు చనిపోయిన రోజు. ఆ రోజు ఐర్లాండులో జాతీయ వాదులంతా 'ఐవీ' ఆకును తమ చొక్కాలకు ధరిస్తారు. ('ఐవీ' అంటే పైకి ప్రాకే ఒకరకమైన మొక్క ఆకు) అలా పార్నెల్ వర్ధంతికి ''ఐవీడే'' అన్న పేరొచ్చింది. జాయిస్ రచనల్లో ఈ 'పార్నెల్' ప్రస్తావన చాలా సార్లొస్తుంది. 'ఎ పోర్ట్రెయిట్' నవలలో 'పార్నెల్'ను గొప్ప దేశ భక్తుడని కొందరు, చివరి రోజుల్లో 'పార్నెల్' పతనమైపోయాడని కొందరు వాదించుకున్న సుదీర్ఘమైన సన్నివేశం ఉంది. ఎన్నికల్ని గెలవడానికి అభ్యర్థులు ఎన్ని ట్రిక్స్‌ని ప్రయోగిస్తారో జాయిస్ ఆనాడే చిత్రించాడు. 'హెంచీ', 'వోకాన్నర్', 'హైన్స్' మొదలైన పాత్రల ద్వారా ఐర్లాండులోని ఆనాటి రాజకీయ వాతావరణం ఎంతో వాస్తవికంగా చిత్రించబడింది.

''ఎ మదర్'' కథలో సంగీతంలాంటి కళలు వ్యాపారంగా మారిపోవటాన్ని జాయిస్ చిత్రించాడు. ఈ కథలోని ''మిసెస్ కియార్నీ''కి గొప్పగా పాటలు పాడే 'కాథలీన్' అన్న కూతురుంటుంది. మిసెస్ కియార్నీ కూతురు చేత సంగీత కచేరీలు చేయిస్తూ బాగా డబ్బు సంపాదించాలనుకుంటుంది. ఒక సంగీత కచేరీని మధ్యలోనే ఆపించి కియార్నీ తన కూతుర్ని థియేటర్‌లోంచి తీసుకొని వెళ్ళి పోతుంది. కారణం, ఆ సంగీత కచేరీని నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ వాళ్ళకిస్తామని ఒప్పుకున్న డబ్బును మొదలే చెల్లించలేదని. కళాకారులైన కూతుళ్ళ కళను వ్యాపారంగా మార్చేసి డబ్బు సంపాదించాలనుకునే తల్లుల్ని ఈ కథ చిత్రించిన తీరు గొప్పగా ఉంటుంది.

'గ్రేస్' అన్న కథలోని కథానాయకుడు ''థామస్ కెర్నన్'' పాత్రక్కూడా జాయిస్ తమ్ముడు ''స్టానిస్ లాస్ జాయిస్సే'' ఆధారమని జేమ్స్ జాయిస్సే స్వయంగా చెప్పాడు. ప్రతి మనిషి తన జీవితంలో మూడు దశల్ని అనుభవిస్తాడని మహాకవి 'Dante' తన 'డివైన్ కామెడి' అన్న కావ్యంలో చెప్పాడు. ఆ మూడు దశలు : నరకం (Hell), భూమి (Purgatory), స్వర్గం (Heaven). 'గ్రేస్' అన్న ఈ కథను జాయిస్ 'డివైన్ కామెడీ'కి పారడీగా రాశాడని విమర్శకులు భావించారు. ఈ కథలో థామస్ కెర్నన్ తాగిన మైకంలో ఓ హోటల్లోని లావెటరీలో పడిపోవడాన్ని ''నరకం''గానూ, ఆ తర్వాత అతని స్నేహితులు కెర్నన్‌ను వాళ్ళింటికి తీసుకొచ్చి అతని భార్యకు అప్పగించడాన్ని ''భూమి'' గానూ, ప్రొటెస్టెంటైన్ కెర్నన్‌ను చర్చ్‌కు తీసికెళ్ళి కాథలిక్‌గా మార్చడాన్ని ''స్వర్గం''గాను పాఠకుడు అర్థం చేసుకోవాలి.

'డబ్లినర్స్' లోని చివరి కథ 'ది డెడ్' చాలా పెద్ద కథ, చాలా గొప్ప కథ కూడా. ఈ కథను 'పెద్ద కథ' అనిగానీ లేదా 'చిన్న నవల' అని గానీ అనొచ్చునని విమర్శకులు భావిస్తారు. ఈ కథ ఆనాటి డబ్లిన్ నగరపు మధ్య తరగతి వర్గాల వారి జీవితాలకు అద్దం పడ్తుంది. ఈ కథలో జీవితం, మృత్యువు, ప్రేమ, ఈర్ష్య, మోహం మొదలైన మానవ జీవితాన్ని గాఢంగా ప్రభావితం చేసే అంశాల సున్నిత చిత్రణ కనిపిస్తుంది. కథ చివర్లో అన్నింటికంటె గొప్పది ప్రేమే నన్న సూచన ఉంటుంది. ఈ కథలోని ప్రధాన పాత్ర 'గేబ్రియల్' ఎవరోకాదు జాయిస్సే గేబ్రియల్ రూపంలో ఈ కథలో కనిపిస్తాడు - జాయిస్ భార్య 'నోరా' ఈ కథలో 'గ్రెట్టా' రూపంలో కనిపిస్తుంది. ఈ కథలో జాయిస్ రచనా శిల్పంలోనూ, శైలీ విన్యాసంలోనూ గొప్ప కవితావేశం కనిపిస్తుంది. ఈ కారణం చేతనే డబ్లినర్స్‌లోని మొదటి పద్నాల్గు కథలు ఒక ఎత్తయితే 'దిడెడ్' కథ ఒక్కటే ఒక ఎత్తని పలువురు విమర్శకులు భావించారు.

క్రిస్టమస్ పండగనూ, నూతన సంవత్సరవేడుకల్నీ జరుపుకోవడానికి మిస్ కేట్, మిస్ జూలియా అన్న ఇద్దరు అక్కచెల్లెళ్ళు తమ యింట్లో పెద్ద విందు యేర్పాటు చేస్తారు. డబ్లిన్‌నగరంలోని ముఖ్యులంతా ఆ విందుకు హాజరౌతారు. అందరిలోకి ముఖ్యుడు 'కాన్‌రాయ్ గేబ్రియల్'. గేబ్రియల్ తన భార్య 'గ్రెట్టా' తో తన చిన్నమ్మల యింట్లో యేర్పాటు చెయ్యబడిన ఈ పార్టీ కొస్తాడు. గేబ్రియల్ గొప్ప మేధావి, రచయిత, జర్నలిస్టు - వక్త. ఈ పార్టీలో ఎన్నో అభిప్రాయాలూ, ఎన్నో జీవన విధానాలు కల్గిన స్త్రీ పురుషులు కలుసుకొని అనేక విషయాలను గూర్చి చర్చిస్తారు. పార్టీ చివర్లో గేబ్రియల్‌ను ఉపన్యసించమని కోర్తారు. గేబ్రియల్ చాలా చక్కటి ఉపన్యాసం చేస్తాడు. గేబ్రియల్ తన ఉపన్యాసాన్ని ముగించేటప్పటికి అర్ధరాత్రి దాటిపోతుంది, అది చలికాలం, బయట విపరీతంగా మంచు కురుస్తుంటుంది. ఆ చలిలోనే ఆ పార్టీ కొచ్చిన అతిథులంతా తమ తమ యిళ్ళకు వెళ్ళిపోతుంటారు. అందరూ వెళ్ళి పోతుండగా ''బార్టెల్‌డి ఆర్క్'' అనే అతడొక పాట పాడ్తుంటాడు. అతని పాట గేబ్రియల్ భార్య గ్రెట్టాను ఆకర్షిస్తుంది. ఆ పాట పేరేమిటని ఆమె 'బార్టెల్‌డి ఆర్క్' ను అడుగుతుంది. ఆ పాట పేరు **"Lass of Aughrim"** అని అతడు చెబుతాడు.

గేబ్రియల్, గ్రెట్టా చలికారణంగా వాళ్ళింటి దాకా వెళ్ళలేక దార్లోనే ఉన్న ఓ హోటళ్ళో రూమ్ తీసుకొని దాంట్లో ఆ రాత్రి ఉండి పోతారు. పార్టీలో తనిచ్చిన ఉపన్యాసానికి అతిథులందరూ అనుకూలంగా స్పందించటం వల్ల గేబ్రియల్ చాలా ఉల్లాసంగా మారిపోతాడు. తన భార్య గ్రెట్టాతో లైంగికంగా ఐక్యమై పోవాలనుకొని తన కోరికను ఆమెకు చెబుతాడు, కానీ గ్రెట్టా మనసులో పార్టీ నుండి వచ్చేముందు, 'బార్టెల్ డి ఆర్క్'' పాడిన పాటే మెదులుతుంటుంది. ఆ పాట ఆమెనొక అత్యంత విషాదస్థితిలోకి తీసికెళ్తుంది. ఆ పాటనొకప్పుడు ఆమెకెంతో సన్నిహితుడైన 'మైకేల్ ఫ్యూరీ' అనే అతడు పాడే వాడట. తనను పెళ్ళి చేసుకోవడానికి ముందు గ్రెట్టా ఈ 'మైకేల్ ఫ్యూరీని' ప్రేమించిందని తెలుసుకొని గేబ్రియల్ అతని మీది ఈర్ష్యతో రగిలిపోతాడు. కానీ మైకేల్ ఫ్యూరి చాలాకాలం క్రితమే చనిపోయాడని గ్రెట్టా చెప్పినప్పుడు చనిపోయిన వ్యక్తి తనకిప్పుడు పోటీ దారుడయ్యాడని తెలుసుకొని గేబ్రియల్ ఆశ్చర్యపడ్తాడు.

మైకేల్ ఫ్యూరీ ఓ రాత్రంతా తన కోసమే మంచులో తడిచిపోయి, ఆరోగ్యం పాడు చేసుకొని చనిపోయాడని గ్రెట్టా చెప్పినప్పుడు గేబ్రియల్‌కు గ్రెట్టా మీది గౌరవం ఎక్కువవుతుంది. మన కోసం ప్రాణమిచ్చే ప్రేమికుడుండటం కంటె గొప్ప విషయమేముంటుందనుకుంటాడు. ఇలా గేబ్రియల్‌ను కొన్ని క్షణాల్లోనే మోహం, ఈర్ష్య, స్పర్ధ, ఆశ్చర్యం, నిర్వేదం, ప్రేమలాంటి సంవేదనలు ఆక్రమించుకుంటాయి. చివరికి అన్నింటికంటె గొప్పది ప్రేమేనని తెలుసుకొని అతని భార్య గ్రెట్టాను ఇదివరకటికంటె ఎక్కువగా ప్రేమిస్తాడు. చనిపోయిన వాళ్ళు సజీవంగా ఉన్న వాళ్ళనెంతగా ప్రభావితం చేస్తారో అర్థం చేసుకుంటాడు. భూతకాలం వర్తమానంతో ఎలా పెనవేసుకు పోతుందో గ్రహిస్తాడు.

ఈ కథకు జాయిస్ జీవితంలో జరిగిన ఒక యథార్థ సంఘటనే ఆధారం. జాయిస్ భార్య నోరా జాయిస్‌ను పెళ్ళి చేసుకోవడానికి ముందు ''మైకేల్ బోడ్కిన్'' అనే అతన్ని ప్రేమించిందట. ఈ మైకేల్ బోడ్కిన్ ''లాస్ ఆఫ్ అగ్రిమ్'' ("Lass of Aughrim") అనే ఐర్లాండ్‌లోని 'గాల్వే' ప్రాంతంలో జానపదులు పాడుకునే పాట ఎంతో శ్రావ్యంగా పాడ్తుండేవాడట. ఆ పాటంటే నోరాకెంతో యిష్టం. ఈ మైకేల్ బోడ్కిన్‌కు క్షయరోగం సోకింది. అతడో రాత్రి చలిలో నోరా కోసం ఎదురు చూస్తూ తన ఆరోగ్యాన్నింకా పాడుచేసుకొని చనిపోయాట్ట. నోరా జాయిస్‌తో మైకేల్ బోడ్కిన్ తన కోసమే చనిపోయాడని చెప్పిందట! ఈ మైకేల్ బోడ్కిన్ 'దిడెడ్' కథలో మైకేల్ ఫ్యూరీగా మనకు దర్శనమిస్తాడు. అతడు పాడినపాట పేరు మాత్రం జాయిస్ మార్చలేదు. ఆ పాట పేరు వాస్తవ జీవితంలోనూ, కథలోనూ ''లాస్ ఆఫ్ అగ్రిమ్''. ఇలా జాయిస్ కథల్లోనూ, నవలల్లోనూ యథార్థ జీవితంలో జాయిస్‌కు తెలిసిన ఎందరో మనుషులు, ఎన్నో సంఘటనలు, ఎన్నో మాటలు యథాతథంగా ప్రవేశించడం కనిపిస్తుంది. అనేక సార్లు ఏది కల్పనో, యేది వాస్తవమో కూడా తెలుసుకోలేక పోతాం. తన కథాంశాల నన్నింటినీ జాయిస్ వాస్తవ జీవితంలోంచే స్వీకరించడం వల్ల ఆయన కథల్లో 'వాస్తవికత' కొట్టవచ్చినట్టు కనబడుతుంది. తన కళ ద్వారా తన వైయక్తిక అనుభూతిని సామాజిక అనుభూతిగా మార్చగల్గడం వల్ల జాయిస్ ఎన్నుకునే ఇతివృత్తాలన్ని ఎంతో ఆత్మాశ్రయంగా కనిపించినప్పటికీ వస్తు నిష్ఠమైనవిగా రూపొందాయి. జాయిస్ కథల్లో పాత్రలు, సంఘటనలు మాత్రమే దర్శనమిస్తాయి. రచయిత పూర్తిగా అంతర్ధాన మయిపోయాడన్న భ్రాంతి పాఠకులకు కల్గుతుంది. ఇదే జాయిస్ శిల్పంలోని వైశిష్ట్యం. ఇదే ఉత్తమోత్తమ శిల్పమని జాయిస్ నమ్మాడు. అలాంటి శిల్పం యొక్క పరిపూర్ణ రూపాన్ని దర్శించాలనే జాయిస్ తన జీవితమంతా కృషి చేశాడు. అతని ఆ అచంచలమైన, అవిశ్రాంతమైన కృషి ఫలితమే ఆయన 'ఎ పోర్ట్రెయిట్', 'యూలిసెజ్', 'ఫన్నిగాన్స్‌వేక్' లాంటి రచనలు.

జేమ్స్ జాయిస్ ప్రభావం తెలుగు సాహిత్యం మీద కూడా కొద్దో గొప్పో ఉందనే చెప్పాలి. శ్రీశ్రీ రచించిన కొన్ని కథల్లోను, రావిశాస్త్రి, బుచ్చిబాబు, నవీన్ రచనల్లోనూ జాయిస్ ప్రభావం కనిపిస్తుంది.

(సమాప్తం)

మహేంజొదారాలో లభించిన ముద్రిక : **పశుపతిగా ప్రఖ్యాతి గాంచిన మఖనాశన**

మన-రాజ (వైవస్వతమను)



పోరుతున్న ఎద్దు (ఈజిప్టు రాజుకు చిహ్నం)

MISIMI/మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No.H/SD/191

మహెంజొదారాలో లభించిన ముద్రిక : **ఇమసాన (ఈసాన = సూర్యదేవుడు)**